


కూలీలకు మూడు నెలలుగా

అందని వేతనాలు

- రూ.25 కోట్లపైనే పెండింగ్
- మెటీరియల్ పనులకు మరో రూ.131 కోట్ల మేర బకాయిలు
- ఆందోళన చెందుతున్న శ్రామికులు
- తదుపరి పనులపై ప్రభావం



ఉపాధి హామీ పథకం బిల్లులు జిల్లాలో రూ.కోట్ల మేర పేరుకుపోయాయి. దాదాపు మూడు నెలలుగా కూలీలకు వేతన చెల్లింపులు నిలిచాయి. మెటీరియల్ కోటా పనులు చేసిన వారికి కూడా ఐదారు మాసాలుగా బిల్లులు ఆగిపోయాయి. అవి మొత్తం సుమారు రూ.156 కోట్ల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బిల్లులు రాక ఇటు కూలీలు, అటు అభివృద్ధి పనులు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రభావం తదుపరి పనులపై పడింది. ఇంకా సుమారు రూ.45 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉండగా అవి ముందుకు సాగడం లేదు. కేంద్రం నుంచి ఇంకా నిధులు విడుదల కాలేదని, అవి వచ్చిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని డ్వామా అధికారులు చెప్తున్నారు.

చెల్లింపులేవీ?

జిల్లాలో రూ.156 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్

నిధులు రాగానే చెల్లిస్తాం

ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. కేంద్రం నుంచి నిధులు రాగానే చెల్లిస్తాం. ప్రస్తుతం రోజువారీ జిల్లాలో లక్ష మందికిపైగా కూలీలు పనులకు వస్తున్నారు. మెటీరియల్ కోటా పనులు చేసిన వారి బిల్లులు అప్‌లోడ్ చేసి ప్రభుత్వం నుంచి ఎప్పుడు నిధులు వస్తే అప్పుడు చెల్లించేలా సిద్ధం చేశాం.

- జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు ఉపాధితోపాటు మెటీరియల్ కోటా పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కోటీ 56 లక్షల పని దినాల కల్పన లక్ష్యంగా నిర్ణయించింది. మొత్తం 4.42 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా అందులో 2.95 లక్షల కుటుంబాలకు చెందిన 5.06 లక్షల మందికి కోటీ 29 లక్షల పని దినాలు కల్పించింది. వారికి వేతన రూపంలో సుమారు రూ.275 కోట్ల మేర లభించింది. అందులో సంక్రాంతికి ముందు చేసిన పనులకు రూ.250 కోట్ల మేర కూలీలకు అందాయి. ఆతర్వాత నుంచి వారికి వేతనాలు రాలేదు. గత ఆర్థిక సంవత్సరంలో సంక్రాంతి నుంచి మార్చి ఆఖరు వరకూ రెండున్నర నెలలకు సుమారు రూ.25 కోట్ల మేర వేతన బకాయిలు నిలిచిపోయాయి. ఆప్రకారం చూస్తే దాదాపు 12.50 లక్షల పని దినాలకు చెల్లింపు చేయాల్సి ఉంది. అలా పెద్దమొత్తంలో నిలిచిపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో పెద్దఎత్తున పనులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లాలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి గతేడాది సెప్టెంబరులో రూ.15 కోట్ల వంతున కేటాయించారు. పశువుల షెడ్ల నిర్మాణాలు, ఇతర పనులను కూడా మంజూరు చేశారు. అలా మొత్తం రూ.178 కోట్ల విలువైన వాటికి అనుమతులు ఇచ్చారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు పనులు చేసేందుకు ఉత్సాహం చూపారు. సగటున ఒక్కో పనికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు కేటాయించి ఎక్కువ మందికి అవి దక్కేలా చూశారు. గత అక్టోబరులో పనులు అధిక భాగం మంజూరు కాగా నవంబరు, డిసెంబరుల్లోనే పెద్దఎత్తున చేశారు. అలా దాదాపు రూ.135 కోట్లకుపైగా విలువైన పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి.

బిల్లుల కోసం ఎదురుచూపులు

పనులు చేసినవారు కూడా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. రూ.30 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. అందులో 2024-25 ఆర్థిక సంవత్సరం పనులకు కేవలం రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయి. దాదాపు రూ.120 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత పక్షం రోజుల్లో మరో రూ.11 కోట్ల బిల్లులు వాటికి కలిశాయి. అలా సుమారు రూ.131 కోట్ల మేర రావాల్సి ఉంది. ప్రస్తుతం భారీగా బిల్లులు ఆగిపోవడంతో కిందిస్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తదుపరి పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో సుమారు రూ.46 కోట్ల విలువైన పనులు అలా ఉన్నట్లు సమాచారం.



గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

గుడ్ ఫ్రైడేను శుక్రవారం జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 40 రోజుల దీక్షలను విరమించారు. పాస్టర్లు దైవసందేశం వినిపించారు. ఏసు ప్రభువు శిలువపై మరణించిన విధానాన్ని తెలియజేసే ప్రతిమతో ఒంగోలులోని పునీత చినథెరిసమ్మ చర్చి నిర్వాహకులు నగరంలో ఊరేగింపు నిర్వహించారు. - లోపలి పేజీల్లో..



కిలకిలరావాలు..

- జరుగుమల్లిలో ఏళ్లతరబడి పలు రకాల విదేశీ పక్షుల ఆవాసం
- వేటగాళ్లను రానివ్వకుండా రక్షిస్తున్న గ్రామస్థులు

7

మెగా డీఎస్సీ వయోపరిమితి

రెండేళ్లు పెంపు

నోటిఫికేషన్ జాప్యంతో అభ్యర్థులు నష్టపోకుండా వెసులుబాటు



ఒంగోలు విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గరిష్ఠ వయో పరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచింది. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే ఇది వర్తిస్తుందని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ గురించి పట్టించుకోలేదు. తీరా ఎన్నికలకు ముందు డీఎస్సీని ప్రకటించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేసింది. దాదాపు సంవత్సరం కావస్తున్నప్పటికీ ఇంకా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఈనేపథ్యంలో అభ్యర్థులు నష్టపోకుండా 2 సంవత్సరాల వయో పరిమితిని పెంచింది. 2024 జూలై 1 కటాఫ్ డేట్‌గా ప్రకటించింది.

మళ్లీ కసరత్తు

- టీచర్ల హేతుబద్ధీకరణ నిబంధనల్లో మార్పులు
- ఎంఈవోల కుస్తీ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు నిబంధనలు మారాయి. దీంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాపులో అన్ని పాఠశాలలకు టీచర్ల కేటాయింపు ప్రక్రియ పాత నిబంధనల ప్రకారం పూర్తిచేసి ఎంఈవోలు డీఈవోకు నివేదికలిచ్చారు. మధ్యాహ్నం పాఠశాల విద్య కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హేతుబద్ధీకరణలో టీచర్ల కేటాయింపు నిబంధనలు మార్చినట్లు ప్రకటించారు. ఆ ప్రకారం శుక్రవారం రాత్రికి తాజా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. దీంతో మండల విద్యాధికారులు తలలు పట్టుకున్నారు.

మారిన నిబంధనలు ఇవీ...

- కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు 59 మంది పిల్లలకు నాలుగు ఎస్‌జీటీలు, 60 నుంచి 150 మందికి ఒక ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం/స్కూలు అసిస్టెంట్, నాలుగు ఎస్‌జీటీలు, 150 మందిపైన ప్రతి 30 మంది పిల్లలకు అదనంగా ఎస్‌జీటీని కేటాయించాలి. మిగులు ఎస్‌జీటీలు ఉంటే 120నుంచి 150 మందికి ఒకరిని అదనంగా కేటాయించాల్సి ఉంది.
- యూపీ స్కూళ్లలో 1నుంచి 5 తరగతులకు విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా టీచర్లను కేటాయించనున్నారు. 6నుంచి 8 తరగతులకు 1నుంచి 10 మందికి ఒక ఎస్‌జీటీ, 11నుంచి 30 మందికి ఇద్దరు, 31 నుంచి 140 మందికి నలుగురు, 141నుంచి 175 మందికి ఐదుగురు ఎస్‌జీటీలను కేటాయిస్తారు.



హేతుబద్ధీకరణపై రాత్రి పదిగంటల సమయంలో కుస్తీ పడుతున్న ఎంఈవోలు

- హైస్కూళ్లలోని 1నుంచి 5 తరగతులకు 10 మంది వరకు ఇద్దరు ఎస్‌జీటీలు, 11నుంచి 30 మంది వరకు ముగ్గురు, 31నుంచి 80 మందికి నలుగురు, 40 మందిపైన ఉంటే ఐదు ఎస్‌జీటీలను కేటాయించమన్నారు. మారిన నిబంధనల ప్రకారం పాఠశాల లకు టీచర్ల కేటాయింపు ప్రక్రియ రాత్రి వరకూ కొలిక్కి రాలేదు.

23న డీఆర్సీ సమావేశం

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం ఈనెల 23న జరగనుంది. అజెండాలో కీలక అంశాలను చేర్చారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇది రెండో డీఆర్సీ సమావేశం. గత ఏడాది జూన్ 12న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఇన్‌చార్జి మంత్రుల నియామకం అక్టోబరు ఆఖరులో జరిగింది. అలా నాలుగు మాసాలు గడిచిపోగా నవంబరు 4న తొలి డీఆర్సీ సమావేశాన్ని ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించారు. మూడు మాసాలకు ఒకసారి కచ్చితంగా డీఆర్సీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా జిల్లాలో మాత్రం సాధ్యపడలేదు. రకరకాల కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న రెండో సమావేశం ఎట్టకేలకు ఐదున్నర మాసాలకు ఈనెల 23న జరగనుంది. ప్రభుత్వ ప్రాధాన్యతలకు సంబంధించిన కీలక అంశాలను ఈసారి డీఆర్సీ సమావేశంలో చేర్చాలని ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం, వేసవిలో తాగునీటి సరఫరా, పీఎం సూర్యఘర్, హౌసింగ్, ప్రజా వినతుల పరిష్కారంలో పురోగతి తదితరాలు అజెండాలో ఉన్నట్లు సమాచారం.



కేసుల దర్యాప్తును ముమ్మరం చేయాలి

- ఎస్పీ దామోదర్
- దేవరాజుగట్టు పోలీసు స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

పెద్దారవీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తును ముమ్మరం చేసి బాధితులను త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. విజివల్, ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. మండల పరిధిలో నేరాలు, శాంతిభద్రతల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాగరాజు, ఎస్బీ సీఐ కేవీ రాఘవేంద్ర, సీఐ ప్రభాకర్ ఉన్నారు.

పొన్న వాహనంపై

చెన్నయ్య వైభోగం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామివారు పొన్నవాహనంపై మురళీకృష్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

7

ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తామంటూ మోసం

● పోలీసులకు ఫిర్యాదు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు తీసుకొని ఓ మహిళా నాయకురాలు, ఆమె భర్త మోసం చేశారంటూ పూనూరి సుబ్బారావు ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గత ఎన్నికల సమయంలో సుబ్బారావుకు సంతనూతల పాడు టికెట్ ఇప్పిస్తానని కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకురాలు నాగలక్ష్మి, ఆమె భర్త సతీష్‌లు తన వద్ద సుమారు రూ.10లక్షలు నగదు తీసుకొని మోసం చేసారని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో పోలీసులు భార్యాభర్తలపై కేసు నమోదు చేశారు.

నైట్‌షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● మెప్మా పీడీ శ్రీహరి



నైట్‌షెల్టర్‌ను తనిఖీ చేస్తున్న పీడీ శ్రీహరి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రం (నైట్‌షెల్టర్)ను ఆసుపత్రికి విచ్చే రోగుల బంధువులు వినియోగించుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. శుక్రవారం స్థానిక నైట్‌షెల్టర్‌ను పరిశీలించిన ఆయన అక్కడ అవసరమైన ఫ్యాన్‌లు ఏర్పాటు చేయించారు. అలాగే ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువుల కోసం అవసరమైన బెడ్‌లు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే కేంద్రానికి వచ్చేవారికి ఎలాంటి సమస్యలు లేకుండా మెప్మా దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారికి మేల్‌చాట్ వస్త్రాల వితరణ



మేల్‌చాట్ వస్త్రాలను అందజేస్తున్న భక్తులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం భక్తులు మేల్‌చాట్ వస్త్రాలను బహూకరించారు. ఊసా ప్రవీణ్‌కుమార్, శ్రావణి దంపతులు ఈ వస్త్రాలు సమర్పించగా వారికి దేవస్థాన వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి మాట్లాడుతూ శ్రీగిరి గో క్షేత్రంలో వృద్ధుల కోసం లిఫ్ట్ ఏర్పాటు చేశామని, ప్రతి శనివారం వసంతోత్సవం ప్రారంభించామని తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం శ్రీవారికి సహస్ర నామార్చన, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం ప్రముఖ గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ స్మృత్యర్థం బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందంచే అన్నమయ్య సంకీర్తనా విభావరి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ.రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాసచరణ్‌రాజీవ్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భైరవి ఫౌండేషన్ సహకారంతో సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కర్నూల్‌రోడ్ బైపాస్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి వేసవిలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో దినసరి కూలీలు, బాటసారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్, సెక్రటరీ సర్దార్‌బాషా, గౌరవ సలహాదారు మండవ సుబ్బారావు, నల్లూరి శ్రీరాములు, జనసేవ శ్రీనివాసరావు, మేడిశెట్టి సుబ్బారావు, గొల్లపూడి రవి పాల్గొన్నారు.

ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

ఒంగోలులో తొలిసారిగా అల్కలైన్ వాటర్ చలివేంద్రాన్ని శుక్రవారం ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మిరియాల పాలెం సెంటర్ వద్ద క్లబ్ వ్యవస్థాపకులు పొట్టి వీరరాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్లా ఆనంద్‌బాబు జ్ఞాపకార్థం కుమారులు ఆల్కలైన్ వాటర్ కూలర్‌ను అందజేశారని, కోట కిరణ్‌కుమార్ చలివేంద్రం నిర్వహణకు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పీవీ.రాఘవరావు, తాళ్లూరు శ్రీనివాసరావు, మద్దాలి మధు, టి.పాండురంగారావు, వైశాలి శ్రీనివాసరావు, బీకేవీ.రమేష్, కోట కిరణ్‌కుమార్, విజయ్‌కృష్ణ, బల్లా యశ్వంత్, పార్శనాథ్, నల్లమల్లి రవి, సొల్లేటి రాము తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

సింగరాయకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు రోడ్డు సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రామలక్ష్మమ్మ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా పాదచారుల కోసం దాతల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు వెంకటరత్నం, నరసింహారావు, లక్ష్మీనారాయణ, గంజి సుబ్బారావు, ఉపాధ్యాయులు రాంబాబు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూలపెద్దమ్మ తిరునాళ్ల

గిద్దలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు గ్రామంలోని మూలపెద్దమ్మతల్లి దేవస్థానంలో ఈనెల 19, 20 తేదీల్లో తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు పూజారి రాచగొర్ల తిరుమలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా 20న ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులుగా ఇవ్వనున్ననట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

శిథిలావస్థలో రక్షిత నీటి ట్యాంకులు

● ఆందోళనలో మర్రిపూడి మండల ప్రజలు



మర్రిపూడిలోని మంచినీటి ట్యాంకు

మర్రిపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రక్షిత నీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. దాహార్తితో వివిధ గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. 40 సంవత్సరాల క్రితం ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెదర్లాండ్ ప్రభుత్వ ఆర్థిక సాయంతో సాగర్ జలాలను పంపిణీ చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు.

● మండలంలోని మర్రిపూడి, చిమట, కాకర్ల, గుండ్లసముద్రం, వేమవరం, కూచిపూడి గ్రామాల్లో ట్యాంకులను నిర్మించారు. కూచిపూడి బస్టాండ్ కూడలిలో నిర్మించిన ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అప్పట్లో ఏ క్షణం అయినా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందడంతో ఆ ట్యాంకును అధికారులు సురక్షితంగా కూల్చివేశారు.

● మర్రిపూడిలో 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారానే ఇప్పటివరకు గ్రామస్థులకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. 10 సంవత్సరాల క్రితం ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ట్యాంక్ మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ట్యాంక్ స్తంభాలను పటిష్టపరిచారు. మరమ్మతులు చేసి 10 సంవత్సరాలు దాటుతున్న నేపథ్యంలో ట్యాంక్ మరోసారి శిథిలావస్థకు చేరింది. లక్షా 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్ నుంచి నీరు లీకువుతోంది. దీంతో పాచిపట్టి ఇనుప చువ్వలు బయట పడుతున్నాయి. దీనికితోడు ట్యాంక్ పై భాగంలో మొక్కలు మొలిచి బీటలువారుతున్నాయి. ప్రస్తుతం గ్రామ జనాభా పెరిగిన నేపథ్యంలో మరో రెండు ట్యాంకులు నిర్మాణం అవసరముంది. శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను కూల్చివేసి అదే స్థానంలో మరో ట్యాంక్ నిర్మించడంతోపాటు గ్రామానికి తూర్పున ఇంకో ట్యాంక్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

● గుండ్లసముద్రంలో శిథిలావస్థకు చేరిన ట్యాంక్ పక్కనే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతనంగా మరో ట్యాంకును నిర్మించారు. అయితే పాత ట్యాంక్‌ను కూల్చకపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పక్కనే ట్యాంక్ ఉండటంతో విద్యార్థులు నిత్యం ఆ పరిసరాలలోనే తిరుగుతుంటారు. ఇప్పటికే ట్యాంక్ ఒక పక్కకు వరిగిపోయింది.

● చిమట, కాకర్లలో ఉన్న ట్యాంక్‌లను తక్షణమే కూల్చివేయాలని ఇటీవల జరిగిన మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

● వేమవరంలో రక్షితనీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరి అలంకార ప్రాయంగా మారాయి. దీంతో వేమవరం గ్రామస్థులకు గత 10 ఏళ్లుగా తాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

● పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



జేఎంబీ చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న జాన్‌అగస్టీన్



వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ జాన్‌కెనడీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో డాక్టర్ డి.జాన్‌అగస్టీన్ వాక్యోపదేశం చేయగా, అదే చర్చిలోని మరో ప్రాంగణంలో టి.జాన్‌కెనడీ వాక్యోపదేశం చేశారు. రామనగర్‌లోని నాజరీన్ బాప్టిస్ట్ చర్చిలో ఎవాంజలిస్ట్ పి.శామ్యేల్‌సన్, సంజయ్‌గాంధీ కాలనీలో ది లార్డ్ చర్చిలో పాస్టర్ పి.సురేష్ వాక్యోపదేశం చేశారు. ఈ నగరంలోని నీలాయపాలెంలోని పునీత చినతెరిసమ్మ చర్చిలో ఏసుక్రీస్తు ప్రభువు శిలువపై మరణించిన విధానం తెలియజేస్తూ ప్రతిమను నగరంలో ఊరేగింపు నిర్వహించారు. అలాగే క్లౌపేటలో ఎప్కోలు ప్రార్థన మందిరం, కబాడిపాలెంలోని పెంతెకోస్తు చర్చి, బైబిల్ మిషన్‌లో ప్రార్థనలు జరిగాయి.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: గుడ్‌ఫ్రైడేను శుక్రవారం మండలంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉప్పుగుండూరు, బినిడమానూరు, ఈదుమూడి గ్రామాల్లోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలలో సంఘకాపరులు తెలగపూడి సుధాకర్, వినేష, రంజిత్‌కుమార్, ఎల్ఇఎఫ్ చర్చిలో ఏసుప్రసాద్, అమ్మనబ్రోలు షకీనా ప్రార్థన మందిరంలో ఐజక్ ప్రసంగించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా జరిగాయి. మద్దిపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ రెబ్బవరపు అబ్రహం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పాస్టర్ బూరుగ ప్రసాదరావు, పాస్టర్ రెబ్బవరపు రాఘవరావు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని ఇచ్చారు. పెద్దకొత్తపల్లిలో పాస్టర్ సుశాంత్‌రావు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చీమకుర్తిలో ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక డ్రైవ్

● నేడు చేపట్టనున్న మున్సిపల్ సిబ్బంది



చీమకుర్తిలో ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ ప్లాంటు

చీమకుర్తి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి) : నేటి ఎలక్ట్రానిక్ యుగంలో రోజురోజుకు పెరిగిపోతున్న ఈ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వేస్ట్)తో కలిగే దుష్పరిణామాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టింది. దీనిలో భాగంగా చీమకుర్తి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్నట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. పట్టణంలోని ఎనిమిది సచివాలయాల పరిధిలో సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాల్లో, గృహలలో చెడిపోయిన, వృథాగా ఉన్న పాత కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, వీడియోగేములు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించనున్నారు. పట్టణవాసులు ఎవరైనా తమ గృహలలో ఉన్న ఈ-వేస్ట్‌ను దగ్గరలో ఉన్న సచివాలయంలో అందచేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కమిషనర్ కోరారు. సచివాలయ పరిధిలో సేకరించిన వాటిని పట్టణంలోని ఎన్ఎస్‌పీకాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్)సెంటర్, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించనున్నారు. ఈ-వేస్ట్ వల్ల కలిగే అనర్థాలకు కళ్లెం వేయటానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

'ఉపాధి హామీ'తో పండ్ల తోటల సాగు

● మూడేళ్ల వరకు ఆర్థికసాయం
● ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి
● ఏపీవో ధనుంజయవర్మ

మద్దిపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సన్న, చిన్నకారు రైతులకు అండగా నిలుస్తోంది. నీటి వసతి, మెట్ట భూముల్లో పండ్ల తోటలను రైతులు సాగు చేసేందుకు చేయూతనిస్తోంది. పండ్ల మొక్కలు నాటిన దగ్గర నుంచి మూడేళ్ల వరకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుంది. ఆ తర్వాత పండ్ల తోటఉ కాపు దశకు వచ్చిన తర్వాత రైతులకు ఆదాయం వస్తుంది. ఐదు ఎకరాల లోపు భూమి ఉండి ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. గుంతల తవ్వకం, మొక్కలు కొనుగోలు, ఎరువులు ఖర్చులకు మూడేళ్ల వరకు ఎకరానికి దాదాపు రూ.30 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ సీజన్లో ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తారు. ఆ తర్వాత వర్షాలు కురవగానే మొక్కలు తెప్పించి నాటుతారు. ఆసక్తి ఉన్న రైతులు ఏప్రిల్, మే నెలలో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలోని వెల్లంపల్లిలో జామ తోటలు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను రైతులు సాగు చేస్తున్నారు. కనుక మండలంలో ఆసక్తి గల రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలం ఏపీవో ధనుంజయ్‌వర్మ కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



ఎస్ఐ శ్రీకాంత్‌కు సీసీ కెమెరాలను అందిస్తున్న నాయకులు



ఎస్ఐ అజయ్‌బాబుకు సీసీ కెమెరాసెట్లను అందిస్తున్న టీడీపీ నాయకులు

● ఎస్ఐ బి.శ్రీకాంత్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఎస్ఐ శ్రీకాంత్ కోరారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఏడు సీసీకెమెరాలను శుక్రవారం ఎస్ఐకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో వాణిజ్య గ్రామమైన ఉప్పుగుండూరులో శాంతిభద్రతల పరిరక్షణ కోసం దాతలు అందించిన సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీనివాసరావు ,పెంట్యాల కోటేశ్వరరావు, బెల్లం శ్రీనివాసరావు, పిన్నక శ్రీకాంత్, బి.సెల్వం, పెంట్యాల శ్రీనివాసరావు, జాస్తి రవి, నల్లూరి భాస్కర్‌రావు, శోభన, గోగినేని శేషగిరి, మాగులూరి సత్యం పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అందజేత

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసేందుకు గ్రామ టీడీపీ నాయకులు మన్నం సుబ్బారావు, తాళ్లూరి శేషారావు, సిరిగిరి కిరణ్ ముందుకు వచ్చారు. రూ.50వేల విలువ చేసే సీసీ కెమెరాలను, ఎస్‌వీఆర్, వైర్లసెట్‌ను సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అజయ్‌బాబుకు శుక్రవారం రాత్రి వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కూడా స్వచ్ఛంధంగా సీసీకెమెరాలను అందజేయాలని కోరారు. సీసీకెమెరాలను త్వరలో రుద్రవరంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోడ్డా..మురుగునీటి చెరువా..!

అధ్వానంగా రహదారి ● స్థానికుల ఆవేదన



మురుగుతో నిండిన రోడ్డును చూపుతున్న స్థానికులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని వీఐపీరోడ్డు మురుగు నీటి చెరువులా మారింది. సైడు కాలువలు సరిగా లేక మురుగు రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా తయారైంది. వర్షంపడితే పరిస్థితి ఇంకా దారుణంగా తయారవుతుందని స్థానికులు వాపోతున్నారు. దోమల ఉధృతి ఎక్కువై అల్లాడుతున్నారు. స్థానిక పంచాయతీ సిబ్బందికి పలుమార్లు సమస్యను విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో విద్యుత్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పశువుల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇదే రోడ్డు ద్వారా అధికారులు, విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వీఐపీరోడ్డు కాలనీవాసులు కోరుతున్నారు.

నేడు ఒంగోలులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతుందని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పీవీఆర్ బాలుర పాఠశాల నుంచి కొత్త కూరగాయల మార్కెట్ మీదుగా ట్రిపుల్ ఆర్ ఈ-వేస్ట్ సెంటర్‌కు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ఈ-చెక్ అంశంపై ఊరచెరువులోని షాదీఖానాలో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా స్పెషలాఫీసర్ సురేష్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్.పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, నగర కార్పొరేటర్లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

మెడికల్ షాపులో చోరీ

మద్దిపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని ఓ మెడికల్ షాప్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ప్రసాద్ కాంప్లెక్స్‌లో ఉన్న మందుల షాపును అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు షట్టర్‌ను పగులగొట్టారు. లోపలికి వెళ్లి రూ.25వేల నగదు, బంగారం తస్కరించారు. దీంతో షాపు నిర్వాహకురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివరామయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో మద్దిపాడులో దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళుతున్న మహిళను మోటార్‌సైకిలిస్టు వేగంగా వెళ్లి ఢీకొట్టాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన ఒంగోలు నగరం భాగ్యనగర్ 4వ లైన్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక రామ్‌నగర్ 7వ లైన్‌లో నివాసం ఉంటూ భాగ్యనగర్ 4వ లైన్‌లో బొటిక్స్ షాపు నిర్వహిస్తున్న గుట్ల మమత ఇంటివద్ద నుంచి స్కూటీపై వెళుతుంది. ఎదురుగా ఓ మోటార్‌సైకిలిస్టు వేగంగా వెళ్లి ఆమెను ఢీకొనడంతో మమత కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రి తరలించారు. శుక్రవారం ఆసుపత్రి నుంచి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆది, సోమవారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం పదిన్నర గంటలకు స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవ కార్యక్రమంలో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

పీబీ చానల్ చైర్మన్‌కు మాతృ వియోగం



నివాళులర్పిస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

సింగరాయకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికివాయి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పీబీ చానల్ చైర్మన్ మందలపు గాంధీచౌదరి తల్లి సీతమ్మ (90) అనారోగ్యంతో గురువారం వారి స్వగృహంలో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు శుక్రవారం కలికివాయికి వచ్చి సీతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నేతలు మాధవ, మించల బ్రహ్మయ్య, చీమకుర్తి కృష్ణ, గణిపినేని రవి, పలువురు నాయకులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

● ఎస్ఐ మహేంద్ర



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ మహేంద్ర

సింగరాయకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసారిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ బి.మహేంద్ర సూచించారు. స్థానిక జాతీయ రహదారిపై కనుమళ్ల రోడ్డు వద్ద శుక్రవారం వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించడం ప్రమాదం జరిగినపుడు ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడవచ్చునని తెలిపారు. హెల్మెట్ వినియోగించిన వాహనదారులపై చట్టపరంగా పెనాల్టీలు విధిస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ గెజిట్ జారీపై హర్షం

సంతనూతలపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీపై టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్-2025కు సంబంధించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేయడం శుభపరిణామం అని అన్నారు. అదేవిధంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు యంగ్‌గ్లోబల్ లీడర్‌గా వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎంపిక చేయడంపై అభినందనలు తెలియజేశారు.

వేదిక పైకప్పు నిర్మాణానికి ఆర్థికసాయం



భూమిపూజ చేస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 18(ఆంధ్ర జ్యోతి): ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కళావేదికపై కప్పు నిర్మాణానికి ఉపాధ్యాయుడు చావలి వెంకటరమణయ్య ఆర్థికసాయం అందించారు. రూ.లక్ష నగదును శుక్రవారం హెచ్ఎం పి.వెంకట్రావుకు అందజేయగా నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వెంకటరమణయ్య మాట్లాడుతూ తాను పని చేసిన పైకప్పు నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రిటైర్డ్ అధికారి అంజనేయులు, అప్పారావు, ఆంజనేయులు, పూర్వ విద్యార్థి శివప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలు మండలం వెంగముక్కపాలెంలోని భగీరథ కెమికల్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పరిశ్రమల్లో ఉన్న బాయిలర్స్ వద్ద, అదేవిధంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసరెడ్డి, భగీరథ కెమికల్స్ ఎండీ ఎస్.చంద్రశేఖర్, జీఎం సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిలకిలరావాలు..

- జరుగుమల్లిలో ఏళ్లతరబడి పలు రకాల విదేశీ పక్షుల ఆవాసం
- వేటగాళ్లను రానివ్వకుండా రక్షిస్తున్న గ్రామస్థులు

జరుగుమల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి గ్రామం పలు రకాల పక్షులు కిలకిలరావాలతో అలరారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల సందడి స్థానికులను ఆకర్షిస్తోంది. గ్రామ బస్టాండ్ సెంటర్‌లోని ఉల్లేరమ్మ ఆలయం సమీపంలోని చింత, వేప చెట్లపై విదేశీ పక్షులు, పలురకాల కొంగలు ఆవాసం ఏర్పరచుకుని ఉంటున్నాయి. ఇవి స్థానికులకు కనువిందు చేస్తున్నాయి. దశాబ్దాల క్రితం నుంచి ఇక్కడే ఉంటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో అధికంగా వేప, చింత చెట్లు ఉండేవని, కాలక్రమంలో రెండు మూడు చెట్లు మాత్రమే మిగిలాయని తెలిపారు. ఉన్న చెట్లపై ఉండే పలు రకాల పక్షుల జోలికి వేటగాళ్లు వెళ్లకుండా నిలువరిస్తున్నామని చెప్పారు. అలాగే గ్రామ శివాలయంలోని బూరుగ, పలురకాల చెట్లపై కబోది పక్షులు దశాబ్దాలుగా ఆవాసం ఏర్పరచుకుని ఉంటున్నాయి. వీటి ప్రత్యేకత ఏమిటంటే వీటికి పగలు కనపడదు. రాత్రిళ్లు మాత్రమే చూస్తాయి. పగటి వేళల చెట్ల కొమ్మలను కాళ్లతో పట్టుకుని తలకిందులుగా వేలాడుతుంటాయి. రాత్రిళ్లు సందడి చేస్తుంటాయి.









మద్యం తాగి వాహనం నడిపితే జైలు తప్పదు

- ప్రమాదాల నివారణకు పోలీసుల తనిఖీలు
- లారీ డ్రైవర్‌కు 10 రోజులు జైలుశిక్ష



ఒంగోలుక్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనచోదన చేస్తూ ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నారు. జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లే కాదు మరి కొంతమంది మత్తుకు బానిసలై మద్యం సేవించి వాహన చోదన చేస్తున్నారు. మద్యం మత్తులో మోటర్ సైకిల్‌పై అనేక ప్రమాదాలు జరిగిన పరిస్థితి ఉంది. అధికంగా మద్యం సేవించిన వారు కార్లను సెల్ఫ్ డ్రైవింగ్ చేస్తూ ఇళ్లకు వెళుతున్నారు. కార్లు నడిపేవారిపైనా పోలీసులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల పోలీసులు తనిఖీలు చేయడంతో మద్యం సేవిస్తూ పట్టుబడిన అనేక మందికి జైలుశిక్షలు పడ్డాయి.

మద్యం తాగుతూ పట్టుబడి జైలుకు వెళ్లింది వీరే..

- హైవేపై రాజస్థాన్‌కు చెదిన లారీడ్రైవర్ సమీన్ మద్యం సేవించి అత్యంత వేగంగా లారీ నడుపుతుండగా ఈనెల 13 మద్దిపాడు పోలీసులు లారీని నిలిపివేసి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్ష చేశారు. అతనికి 398.1/100 ఎం.ఎల్ రీడింగ్ చూపించింది. అంటే అంత అతిగా మద్యం సేవించాడు. ఈనెల 15న రెండో తరగతి న్యాయాధికారి రామారావు వద్ద డ్రైవర్ సమీన్‌ను హాజరుపరచగా 10 రోజులు జైలు శిక్ష విధించారు.
- తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన దుగ్గి కిషోర్ మద్య సేవించి ఒంగోలులో మోటర్ సైకిల్ నడుపుతుండగా తాలూకా పోలీసులు పట్టుకున్నారు. గత బుధవారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఆరు రోజులు జైలుతోపాటు రూ.6 వేలు జరిమానా విధించారు.
- ఒంగోలు శ్రీరామ కాలనీకి చెందిన కమ్మనేని రమణయ్య ఈ నెల 13న మద్యం సేవించి వాహనం నడుపుతుండగా తాలూకా పోలీసులు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్ష చేశారు. మద్యం ఎక్కువగా తాగి ఉండడంతో గత మంగళవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రామారావు రెండు రోజులు జైలు, రూ.3వేలు జరిమానా విధించారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు- ఎస్పీ

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. నిత్యం జిల్లా అంతట తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశానికి 25శాతం ఉచితసీట్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28నుంచి మే 15 వరకు సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అడ్మిషన్లకు సంబంధించి సందేహాలు నివృత్తికి 18004258599 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు ప్రస్తుత చిరునామా కోసం తల్లిదండ్రుల ఆధార్, ఓటర్ కార్డు, రేషన్ కార్డు, భూమి హక్కు పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డ్, పాస్‌పోర్టు,డ్రైవింగ్ లైసెన్సు, విద్యుత్ బిల్లులు, పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. సీబీఎస్‌ఈ, ఐబీ, ఐసీసీఈ పాఠశాలల్లో ప్రవేశాలకు మార్చి 31నాటికి ఐదేళ్లు నిండి ఉండాలి. అదే విధంగా స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు జూన్ 1నాటికి ఐదేళ్లు నిండి ఉండాలి. మే 16నుంచి 20 వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారు. మే 21నుంచి 24 మధ్యమొదటి విడత లాటరీ ద్వారా ప్రవేశాలకు ఎంపిక చేస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 2లోపు పాఠశాలల్లో చేరాలి. రెండో విడత జాబితాను జూన్ 8న ప్రకటిస్తారు.

సెక్టోరల్ పోస్టులకు ఎస్‌జీటీలూ అర్హులే

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్య కమిషనర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయాల్లో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారుల పోస్టులకు స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు మాత్రమే అర్హులని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సెక్టోరల్ అధికారులుగా గ్రేడ్-2 హెడ్మాస్టర్లు(హైస్కూలు) అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులుగా స్కూలు అసిస్టెంట్లను నియమించేవారు. తాజా ఉత్తర్వుల మేరకు సెక్టోరల్ అధికారులుగా హెచ్‌ఎంలను తప్పించి ఆ స్థానంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు అవకాశం కల్పించారు. వీరికి చెక్ పవర్, నిధులు డ్రా చేసే అధికారం ఇస్తారు. సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారుల పోస్టులకు స్కూలు అసిస్టెంట్లుగా ఐదేళ్లు, ఎస్‌జీటీగా ఎనిమిదేళ్ల సర్వీసు, పీజీ విద్యార్హతలు ఉండి, 55 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు, ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యం ఉన్న వారు మాత్రమే అర్హులని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్, ఎంఈవో, ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్లు, సీఎంవో, ఐఈ కోఆర్డినేటర్, జీసీడీవో సెక్టోరల్ అసిస్టెంట్, సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయాల్లో భవిష్యత్‌లో జరగనున్న నియామకాలను కొత్త నిబంధనల ప్రకారం జరుగుతాయని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పారదర్శకంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- నిబంధనల ప్రకారం విద్యార్థుల నిష్పత్తి మేరకు టీచర్లను కేటాయించాలి
- ఎంఈవోల సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో 117 జీవో రద్దు అనంతరం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం ఎంఈవోలతో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం పాఠశాలలకు టీచర్లను కేటాయించాలని ఎంఈవోలను ఆదేశించారు. 1, 2 తరగతులు ఉండే ఫౌండేషన్ స్కూళ్లలో 30 మంది పిల్లలు వరకు ఉంటే ఒక ఎస్‌జీటీ, 31నుంచి 60 మంది వరకు ఇద్దరు ఎస్‌జీటీలను కేటాయించాలన్నారు. 1నుంచి 5 తరగతులు ఉండే బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో 20 మంది వరకు విద్యార్థులు ఉంటే ఒక ఎస్‌జీటీ, 21నుంచి 60 మందికి రెండు ఎస్‌టీజీలను కేటాయించాలని చెప్పారు. ఉప విద్యాధికారులు చంద్రమౌళీశ్వరరావు, శామ్యూల్, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

21న మోడల్ స్కూళ్ల ప్రవేశపరీక్ష

ఒంగోలు విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏపీ మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదట ఈ పరీక్షను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 20వతేదీ ఈస్టర్ పండుగ కారణంగా ఆరోజు వాయిదా వేసి 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు జరుగుతుందని వివరించారు. రాచర్ల, కనిగిరి, దర్శి మండలం శాంతినగర్, ముండ్లమూరు, పెదదోర్నాల మండలం మల్లికార్జునపురం, మార్కాపురం మండలం మిట్టమీదపల్లెలో ఏపిమోడల్ స్కూళ్ళు ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ బోధన అందించడమే లక్ష్యం

- మాజీ మంత్రి సురేష్
- జార్జి కళాశాలకు స్వయం ప్రతిపత్తి


అటానమస్ గుర్తింపు పత్రంతో సురేష్, కాలేజీ అధ్యాపకులు

మార్కాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో కూడిన ఉత్తమ బోధన అందించడమే జార్జ్ విద్యాసంస్థల లక్ష్యమని కళాశాల సాంకేతికత సలహాదారు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. స్థానిక జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాల అయిన తమ సంస్థ ఉత్తమ ప్రమాణాలతో కొనసాగుతోందని చెప్పారు. నేడు పశ్చిమ ప్రకాశంలో అటానమస్ గుర్తింపును కూడా పొందిన మొదటి కళాశాలగా నిలిచిందన్నారు. ఇప్పటికే జేఎన్‌టీయూ, కాకినాడ శాశ్వత అనుబంధ గుర్తింపు, నాక్ ఏ గ్రేడ్‌ను ఇచ్చిందన్నారు. స్వయం ప్రతిపత్తి ద్వారా కళాశాలలో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ ఎమ్.మస్తానయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్‌కాశీం పాల్గొన్నారు.

పౌరుషానికి ప్రతీక ఒంగోలు జాతి ఎడ్లు

- బలప్రదర్శన పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల
- సత్తాచాటిన నంద్యాల, బాపట్ల జిల్లా కంబైన్డ్ జత


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పౌరుషానికి, ప్రతీక ఒంగోలు జాతి ఎడ్లు అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం పాల పండ్ల సైజు ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి తొలుత పోటీల్లో ఉన్న ఎడ్ల జతను కొద్దిసేపు నడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా బ్రహ్మోత్సవాల్లో ఎడ్ల బలప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రైతాంగానికి ఇలాంటి కార్యక్రమాలు పండుగలాంటివని చెప్పారు. ఆ సంప్రయాదాన్ని కొనసాగిస్తూ ఈఏడాది భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన తూర్పు బండ కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు డీవీ కృష్ణారెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి, షేక్ మౌలాలి, అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజేత నంద్యాల, బాపట్ల కంబైన్డ్ జత

ఆరుపండ్ల విభాగం(పాలపండ్ల సైజు)లో తొలిరోజు జరిగిన పోటీల్లో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి. వాటిల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం తోటకందుకూరుకు చెందిన గోన నరసింహారెడ్డి, బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన అత్తోట శిరీషా, శివకృష్ణ చౌదరిలకు చెందిన సంయుక్త ఎడ్ల జత బండను 4,760 అడుగుల దూరంలాటి ప్రథమ బహుమతిగా రూ.60 వేలను కైవసం చేసుకున్నాయి. వీరికి గొట్టిపాటి సూరి బహుమతిని అందించారు. అదేవిధంగా రెండో బహుమతిని నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి ఎడ్ల జత 4,750 అడుగుల దూరం బండనులాగి కైవసం చేసుకుంది. ఈ ఎడ్ల యజమానులకు బహుమతి రూ.40 వేలను మోరా వెంకటరెడ్డి అందించారు. మూడో బహుమతిని బేస్తవారిపేట మండలం ఖాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసూరారెడ్డి ఎడ్లజత 4,750 అడుగుల దూరంలాగి గెలుపొందింది. రూ.30 వేలను చిలకపాటి చిన్నవెంకటచెన్నయ్య అందించారు. నాలుగో బహుమతిని కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం అయోధ్యనగర్‌కు చెందిన డి.వెంకటసాయినిఖిల్‌రెడ్డి ఎడ్లజత 4,721 అడుగుల దూరంలాగి కైవసం చేసుకుంది. రూ.20 వేలను నాలికొండయ్య అందజేశారు. ఐదవ బహుమతిని రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన సూరా పూజితారెడ్డి ఎడ్లజత 4,367 అడుగుల దూరంలాగి గెలుపొందింది. రూ.10 వేలను సూరెడ్డి పరమేశ్వరరెడ్డి, గొలమారి అంజిరెడ్డిలు అందజేశారు. ఆరో బహుమతిని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం తోటకందుకూరుకు చెందిన గోనా శరణ్యారెడ్డి ఎడ్లజత 4,250 అడుగుల దూరం బండనులాగి గెలుపొందగా ప్రైజ్ మనీ రూ.8 వేలను మట్టం వెంకటేశ్వర్లు అందించారు.

పొన్న వాహనంపై నల్లనయ్యగా చెన్నయ్య


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు


అలరించిన కళారూపాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చెన్నకేశవ స్వామి శుక్రవారం తెల్లవారుజామున మురళీకృష్ణ అలంకారంలో పొన్నవాహనంపై నాలుగు మాడవీధులలో విహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో పొన్నమాను వాహనంపై చెన్నకేశవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. నాలుగు మాడవీధులలో విహరించిన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కనక తప్పెట్లు, వివిధ కళారూపాలు, మహిళా కోలాటాల బృందం, కోలాటాలతో నగరత్సోవం సాగింది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, ఉభయదాతలు నగరోత్సవంలో పాల్గొన్నారు.


వాహన సేవలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


మహిళల కోలాటం

అవీ.. ఇవీ

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు మార్కాపురం పట్టణంలో శుక్రవారం మార్కాపురం వక్ఫ్ పరిరక్షణ సమితి జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జామియా మస్జిద్ నుంచి పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, రీడింగ్ రూమ్, కంభం సెంటర్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. లౌకిక ప్రజాస్వామ్య ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని సంఖ్యాబలంతో ఆమోదించడం సిగ్గుచేటని సుప్రీంకోర్టు తాత్కాలిక తీర్పుతో ఈ చట్టం రాజ్యాంగానికి వ్యతిరేకం అని రుజువైందన్నారు. ఈ నల్లచట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ముఫ్తి అబ్దుల్ రెహమాన్, కో కన్వీనర్‌లు కరిముల్లా, ఖసీం, ముతవల్లిల అధ్యక్షులు మీర్జ సబ్దర్ అలీబేగ్, ఎంపీజే నాయకులు రజాక్, రసూల్, వామపక్ష నాయకులు అందె నారసరయ్య, డీకెఎం రఫీ, సోమయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల బాబు, లౌకికవాదులు, ప్రజాసంఘాలు, ఆయా మస్జీదుల ముతవల్లిలు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు



బోల్తా పడ్డ కారును పరిశీలిస్తున్న పోలీసులు

తర్లుపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానాగులవరం వంతెన వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్తుండగా కారు అదుపుతప్పడంతో పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని తర్లుపాడు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు పరిశీలించారు. అదుపుతప్పిన కారు పోలీసులు వెళ్లక మునుపే డ్రైవర్ ఆటోలో వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గాయాలైన వ్యక్తి మార్కాపురం చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కంభంలో గంటల కొద్దీ కరెంటు కోతలు

కంభం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కంభం మండలంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతుల పేరుతో ముందస్తు సమాచారం లేకుండా గంటల కొద్ది విద్యుత్ కోతలు విధిస్తుండడంతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్నపాటి గాలులు వీచినా కరెంటు తీసివేస్తున్నారు. కారణం అడిగితే చెట్ల కొమ్మలు తీగలపై పడి తీగలు తెగాయని, రిపేరు చేస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు మండుతున్న ఎండలతో ఉదయం 11 గంటలకే ప్రజలు పనులు ముగించుకుని ఇళ్లకు వెళుతున్నారు. అయితే గంటల కొద్ది కరెంటు కోతలతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికైన విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ కోతలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పశువుల తొట్ల నిర్మాణానికి శంకుస్థాపన



పశువులతొట్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

కొమరోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం పశువుల తొట్లను నిర్మిస్తోందని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని తాటిచర్ల గ్రామంలో పశువుల తొట్లు నిర్మించేందుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ మండలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు పశువుల తొట్లను నిర్మిస్తున్నామన్నారు. వాటని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవిలో కుంటలు, వాగులు, చెరువులు ఎండిపోవడంతో పశువులు, మూగ జీవాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పశువులకు నీటితొట్లను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్మిస్తోందని తెలిపారు. వీటిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మహాలక్ష్మి, టీఏలు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొమరోలు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రెడ్డిచర్ల గ్రామంలో ప్రధానమంత్రి సూర్యఘర్‌యోజన కింద సోలార్ విద్యుత్ కనక్షన్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. దీంతో సాదారణ గృహ వినియోగదారునికి విద్యుత్ బిల్లులు భారం కాకుండా ఉండేందుకు సోలార్ ప్యానెల్స్‌ను మీ ఇంటిపైన పెట్టి విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చునన్నారు. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి నగదు చెల్లిస్తుందన్నారు. ఇలా సాదారణ గృహ వినియోగదారులు 1కిలోవాట్, 2కిలోవాట్‌కు, 3కిలోవాట్‌కు ప్రభుత్వం రూ.30వేలు, రూ.60వేలు, రూ.78వేల వరకు రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిచర్ల ఉమాదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదిజాంబవంతుని విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న శివ స్వామి

పెద్దదోర్నాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో శ్రీశైలం రోడ్డులోని ఆదిజాంబవంతుని విగ్రహ ప్రతిష్ఠకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఆది జాంబవ సమాజ సేవాసమితి ఆధ్వర్యంలో 32 అడుగుల విగ్రహం ఏర్పాటుకు శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మదన్‌గుప్త, తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి బండారు శృతి, సేవాసమితి వ్యవస్థాపక అధ్యకులు దారి వేముల శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు టీ శ్రీరామ్‌రెడ్డి, కార్యదర్శి నరసింహులు, కోశాధికారి వానిరెడ్డి హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంటు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ నేతకు ఏఎంసీ పీఠం

- సామాన్య కార్యకర్తకు లభించిన అరుదైన గౌరవం
- టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



ఇమాంసాహెబ్

పొదిలి, ఏప్రిల్ 18 : టీడీపీలో ఆయన ఒక సామాన్య కార్యకర్త వార్డుసభ్యునిగా ఎంపీటీసి సభ్యునిగా పనిచేసిన ఇమాంసాహెబ్‌ను ఈ పర్యాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరించింది. అనేక మంది కాకలుతీరిన నేతలు చైర్మన్‌పీఠంపై ఆశలు పెట్టుకున్నప్పటికీ, పార్టీ అదిష్టానం నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు ఉన్న ఇమాంసాహేబ్‌కు ఈ పదవిని కట్టబెట్టింది. ప్రజా వైద్యునిగా పట్టణంలో సుపరిచితులైన ఆయన దివంగత మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి అనుంగ శిష్యునిగా టీడీపీలో గుర్తింపు పొందారు. తొలిసారిగా ప్రతిష్టాత్మకమైన పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గిరి ఒక మైనారిటీ నేతకు దక్కడం విశేషం. టీడీపీ తొలి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఆ పదవి ఆర్యవైశ్య వర్గానికి చెందిన కారంశెట్టి సత్యనారాయణను వరించింది. ఆతరువాత కొనకనమిట్ల మండలం పెదారికట్లకు చెందిన అదే సామాజిక వర్గం నుండి గాదంశెట్టి నరసింహారావును ఎంపిక చేశారు. అనంతరం కొండపి నియోజకవర్గం మర్రిపూడి మండలానికి చెందిన యర్రమోతు శ్రీనివాసులును చైర్మన్ పీఠం వరించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొనకనమిట్ల మండలం వెలిగండ్లకు చెందిన పాతకోట కృష్ణారెడ్డి చైర్మన్‌గా కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ రెండసారి అధికారంలోకి వచ్చిన తరువాత పొదిలి మండల ఏలూరు గ్రామానికి చెందిన గుజ్జుల రమణారెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2014 తరువాత టీడీపీ అధికారంలోకి రాగానే ఎంతోమంది ఆశావాహులు చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు ప్రకయత్నాలు చేసినప్పటికి అప్పటి టీడీపీ ఇంచార్జ్ కందుల నారాయణరెడ్డి సిఫారసుతో కొనకనమిమిట్ల మండలం చినమన గుండం గ్రామానికి చెందిన చప్పిడి రామలింగయ్యను పదవి వరించింది. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవులకు సైతం రిజర్వేషన్‌లు కల్పించింది. పొదిలి ఏఎంసీ పదవి బీసీ మహిళకు కేటాయించారు. అప్పట్లో పొదిలి మండల వైసీపి అధ్యక్షుడు గుర్రపుశాల శ్రీనివాసులు సతీమణి కోటేశ్వరి చైర్మన్‌గా రెండు పర్యాయాలపాటు పదవిలో కొనసాగారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తరువాత అదే ఆనవాయితీని కొనసాగిస్తూ చైర్మన్ పదివిని మైనారిటీలకు కేటాయించారు. మైనారిటీల్లో సౌమ్యునిగా గుర్తింపు పొందిన ఇమాంసాహేబ్ పేరును స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అదిష్టానానికి సిఫారసు చేశారు. పార్టీ అదిష్టానం సైతం నిర్వహించిన అంతర్గత సర్వేలో కూడా ఇమాంసాహేబ్‌కు కార్యకర్తల నుంచి మద్దతు లభించింది. దీంతో ఆయనను చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. త్వరలో పూర్తిస్థాయి పాలకవర్గ సభ్యుల నియామకం పూర్తి కాగానే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వైద్యునిగా పలువురుకి చికిత్స అందిస్తున్న ఆయన నిస్తేజంగా ఉన్నా పొదిలి మార్కెట్ కమిటీకి ఆరుదైన శస్త్రచికిత్స చేసి జవసత్వాలు నింపుతారని మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు ఆశిస్తున్నారు.



పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మార్కాపురంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్యాస్‌గోడౌన్లలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా భారత్ గ్యాస్ గోడౌన్‌లలో అగ్నిప్రమాదాల నివారణ ముందస్తు జాగ్రత్త చర్యలను సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోడౌన్లలో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. గోడౌన్ ప్రాంతాలలో సిగరెట్లు తాగకుండా నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సిలండర్ డెలివరీ చేసేటప్పుడు చెక్ చేసుకోని ఇవ్వాలన్నారు.

వేసవిలో ఆదమరిస్తే అగ్ని ప్రమాదాలే

ఎర్రగొండపాలెం : వేసవి ఉష్ణోగ్రతలు పెరిగాయని అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్ఎఫ్‌వో మాల్యాద్రి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎర్రగొండపాలెంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద అవగాహన కల్పించారు.

అగ్నిప్రమాద నివారణపై అవగాహన

పెద్ద దోర్నాల: స్థానిక భారత్ పెట్రోల్ బంకు వద్ద ప్రజలకు అగ్నిప్రమాదాలపై ఆ శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా కేంద్రం అధికారి హరిబాబు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు.

కంభం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కందులాపురం పంచాయతీలోని గ్యాస్‌గోడౌన్, పెట్రోల్‌బంకుల వద్ద అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బందికి, ప్రజలకు అగ్ని ప్రమాదాలపై నివారణ చర్యల కరపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో కంభం అగ్నిమాపక అధికారి పిచ్చయ్యచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బేస్తవారపేట,ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేటలో సాయి బాబా తిప్ప వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు శుక్రవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సూమారు 100 మంది కూలీలకు అందజేశారు. కార్యక్రమంలో టీఏ అంబటి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ముప్పూరి రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం మంజూరుపై హర్షం

గిద్దలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు 7 నెలల గౌరవ వేతనం 35 వేల రూపాయలు మంజూరు చేయడంపై ప్రసన్నత మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ జగన్‌పాల్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 2024 మే నుంచి నవంబరు వరకు 7 నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేసి వారి ఖాతల్లో వేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, ఫరూఖ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

గిద్దలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిత్యం జరుగుతున్న గోవుల అక్రమ రవాణాను ప్రభుత్వం అరికట్టాలని బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట గోవులు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారన్నారు. వీరిపై కేసులు బనాయించి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. గోవుల అక్రమ రవాణా హిందుత్వంపై దాడిగా భావిస్తున్నామని, అక్రమ రవాణా వెనుక ఉన్న మాఫియాను అడ్డుకోవాలని కోరారు.

నేటి నుంచి మూలపెద్దమ్మ తిరునాళ్ల

గిద్దలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు గ్రామంలోని మూలపెద్దమ్మతల్లి దేవస్థానంలో ఈనెల 19, 20 తేదీలలో తిరునాళ్ల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి రాచగొర్ల తిరుమలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రెండురోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎడ్లబలప్రదర్శన పోటీల ఏర్పాటు

తిరునాళ్ల సందర్భంగా కొమ్మునూరులో ఈ నెల 20న ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులుగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9505170872, 8367695528 సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



గిద్దలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో రైల్వేశాఖ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గిద్దలూరు మీదుగా వెళ్లే రైళ్లలో బోగీలు ఆగే ప్రాంతంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి వారికి రైలు ఆగిన సందర్భంలో తాగునీటిని అందించాలని గుంటూరు డీఆర్ఎం ఆదేశించడంతో ఆమేరకు రైల్వేశాఖ అధికారులు ప్లాట్‌ఫారాలపై పలు ప్రాంతాలలో మట్టి కుండలను ఏర్పాటు చేసి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమర్షియల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో ఎస్పీ



చెన్నకేశవస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి ఆలయంలో జిల్లా ఎస్పీ దామోదర్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆలయ విశిష్టతను వివరించారు. డీఎస్పీ నాగరాజు పాల్గొన్నారు.



వై.పాలెంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు బ్రాహ్మణ గరుడసేవ సమారాధన

మార్కాపురం వన్‌టౌన్ : శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆల యంలో బ్రహ్మోత్సవాల సంద ర్భంగా శనివారం బ్రాహ్మణ గరుడసేవ సమారాధన మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసుల రెడ్డి, నిర్వాహకులు జటప్రోలు దక్షిణామూర్తి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెన్నకేశవునికి విశేష పూజలు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలం లోని వెంకటాద్రిపాలెం గ్రామంలో వేంచేసి న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజు శుక్రవారం ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంజివారిపల్లి గ్రామానికి చెందిన ఉభయదారులు ఇలకొటి పెద్ద చెన్నారెడ్డి, వెంకిరెడ్డి, చెన్నారెడ్డి, పాలంకిరెడ్డి, చిన్న చెన్నారెడ్డి, చెన్నకేశవులరెడ్డి, రామిరెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డిలు గ్రామం నుంచి రథాన్ని తీసుకోచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పిలుపు
- అల్ అలి అమానత్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు

మార్కాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కంభం రోడ్డు సమీపంలోని డాక్టర్ మౌలాలి వైద్యశాల వద్ద అల్ అలి అమానత్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం అటుగా వెళ్తున్న పాదచారులకు నీటిని అందించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నందున వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ మౌలాలి ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్‌ను ప్రజలకు అందజేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో పగటివేళ మధ్యాహ్నం బయటకు రాకుండా ఉండడం మేలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఇమ్మడి కాశీనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, కౌన్సెలర్ నాలి కొండయ్య, పఠాన్ ఇబ్రహీం, పఠాన్ గులాబ్ ఖాన్, పఠాన్ హుసేన్‌ఖాన్, బొందిలి కాశీరామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక కార్యక్రమాలు





వై.పాలెంలో శిలువను మోస్తున్న ఫాదర్, మార్కాపురంలో ప్రత్యేక ప్రార్థనలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 18 ఆంధ్రజ్యోతి: గుడ్‌ ఫ్రైడే ను మార్కాపురం పట్టణంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఎర్రం జాన్ ఆధ్వర్యంలో ప్రత్యే ప్రార్థనలు నిర్వహించారు. కథోలికులు పరిశుద్ధ శిలువ మార్గాన్ని జరుపుకుంటూ చర్చిలోకి ప్రవేశించారు. ఫాదర్ జాన్ సందేశమిస్తూ, శిలువపై క్రీస్తు ఏడు గొప్ప మాటలను చివరిగా పలికారన్నారు. వాటిలో దాగివున్న సత్యాలను గ్రహించి క్రీస్తు అడుగుజాడల్లో జీవనాన్ని సాగించాలన్నారు. ఏబీఎం కాంపౌండ్‌లో సంఘ కాపరి రెవరెండ్ అమృత తేజ్ వాఖ్య సందేశం అందించారు. చర్చి అధ్యక్షులు శ్యామ్యూల్, ఉపాధ్యాక్షులు ఆర్థర్, కార్యదర్శి జయరావు, కోశాధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : పట్టణంలోని బిలివర్స్ ఈస్ట్రన్ చర్చి ఫాదర్ గుర్రం జాన్‌రంగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ కాలనీ నుండి జంక్షన్ వరకు శిలువ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో షాలెంరాజు, చిట్టిబాబు, ఫౌలుబాబు, కిషోర్, ఆశాజ్యోతి, ప్రత్విన్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని వీరభద్రాపురం, గురిజేపల్లి, గోళ్లవిడిపి తదితర గ్రామాలలో క్రైస్తవులు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ఆయా గ్రామాలలో ఏసు క్రీస్తు శిలువనెక్కిన కథనంతో నాట్య ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గిద్దలూరు టౌన్ : ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తూ క్రీస్తు చేసిన త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అని టీడీపీ నాయకుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా శిలువను క్రిష్ణకిశోర్‌రెడ్డి మోశారు.

ఎర్రగొండపాలెం : గుడ్ ఫ్రైడే సందర్భంగా రెవరెండ్ రవికిరణ్ క్రీస్తు సందేశం వినిపించారు. శుక్రవారం ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. త్రిపురాంతకం అంబేద్కర్ కాలనిలో సండేస్కూల్ పిల్లలు గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పార్థనలు చేసి ర్యాలీ నిర్వహించారు.

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కంభంలోని ఏబీఎం చర్చి, ఆర్‌సీఎం చర్చి, బ్రదరన్ చర్చి, సిఎస్‌ఐ, పెథకోస్ట్, ఎఫ్‌కోల్, సెవన్‌డే చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.

పొదిలి : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రైస్తవులు పొదిలిలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు శిలువను ఏర్పాటు చేసి చర్చి వద్ద నుంచి ఆర్‌టీసీ బస్టాండ్, విశ్వనాథపురం, అంజనేయ స్వామి దేవాలయం మీదుగా క్రీస్తు వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. శిలువ మోస్తూ జగతికి శాంతి సందేశమిస్తూ ప్రదర్శన చేశారు. అనంతరం ర్యాలీగా మార్కాపురం అడ్డరోడ్డు వరకు ప్రదర్శన కొనసాగింది.







బేస్తవారపేటలో శిలువను మోస్తున్న రంగయ్య, పొదిలిలో శిలువను మోస్తున్న ఫాదర్, ఎర్రగొండపాలెంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

వేధిస్తున్న సిబ్బంది కొరత

» విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
» ప్రజలకు ఇక్కట్లు

పీసీపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏఈ నుంచి ఎల్ఎంలు, ఏఎల్ఎంలు లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో చిన్నపాటి అవాంతరాలు ఎదురైనా గ్రామాలు చిమ్మచీకట్లోనే ఉండాల్సివస్తుంది. కొద్దిపాటి గాలివీచినా, చిరుజల్లులు పడినా ఫీడర్లు బ్రేక్‌డౌన్ అయ్యి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలంటే ప్రైవేటు వ్యక్తులు లేదా ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకొచ్చి మరమ్మతులు చేస్తేనే తిరిగి ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది.

మండలంలో పెదఅలవలపాడు, పీసీపల్లి, పెదయిర్లపాడు, గుంటుపల్లి గ్రామాల్లో నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. పెదఅలవలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో నేరేడుపల్లి, వెంగళాపురం, పెదఅలవలపాడు, పోతవరం ఫీడర్లు, పీసీపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మర్రికుంటపల్లి, మారెళ్ల, పీసీపల్లి టౌన్, వరిమడుగు ఫీడర్లు, గుంటుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మూలెవారిపల్లి, దేశిరెడ్డిపల్లి, గుంటుపల్లి ఫీడర్లు, పెదయిర్లపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వెంగళాయపల్లి, అడివిలోపల్లి, పెదయిర్లపాడు ఫీడర్లు ఉన్నాయి. కనిగిరి మండలం అడ్డరోడ్డు సబ్‌స్టేషన్ నుంచి తలకొండపాడు ఫీడరు, ఏరువారిపల్లి సబ్‌స్టేషన్ నుంచి భట్టుపల్లి ఫీడరు మొత్తం 16ఫీడర్లు ఉన్నాయి. ఈ ఫీడర్ల నుంచి గృహాలకు సింగిల్‌ఫేస్, వ్యవసాయ కనెక్షన్లకు త్రిబుల్‌ఫేస్ విద్యుత్ సరఫరా అవుతుంది.



పీసీపల్లి సబ్‌స్టేషన్



విద్యుత్‌లైను మరమ్మతులు చేస్తున్న ప్రైవేటు వ్యక్తి

మండలంలో ఏఈతో పాటు ముగ్గురు లైన్‌మెన్‌లు, ఒక సబ్‌ఇంజనీర్, ఎల్ఐలు ఇద్దరు, ఏఎల్ఎంలు నలుగురు మొత్తం 11మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు లైన్‌మెన్‌లు, ఇద్దరు లైన్‌ఇన్‌స్పెక్టర్‌లు మొత్తం నలుగురు మాత్రమే ఉన్నారు. ఏడుగురు సిబ్బంది కొరత ఉంది. వీరిలో ప్రధానంగా ఏఈతో పాటు సబ్ ఇంజనీర్, మండలకేంద్రమైన పీసీపల్లికి లైన్‌మెన్‌లు లేరు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ఏఈ లక్ష్మీరాజేష్, పీసీపల్లి లైన్‌మన్ రమణ బదిలీపై వెళ్లారు. పీసీపల్లికి వేరేప్రాంతం నుంచి అధికారిని నియమించినా ఆయన విధులలో జాయిన్ కాలేదు. తాత్కాలికంగా కనిగిరి టౌన్ ఏఈని ఇన్‌చార్జ్‌గా నియమించారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేస్తే ప్రైవేటు వ్యక్తులను లేదా ఇతరప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకువచ్చి రెండురోజుల తరువాత మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. సిబ్బంది కొరత ఉండడంతో విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వాటిని వెంటనే పునరుద్ధరించలేకపోతున్నామని ఓ అధికారి చెప్పాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీసీపల్లి మండలంలో ఖాళీగా ఉన్న విద్యుత్ పోస్టులను భర్తీ చేయాలని మండలంలోని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చూడాలి

- గోనుగుంట్ల చెన్నయ్య పెద్దన్నపల్లి



చినుకు పడితే గ్రామాలు చీకట్లో ఉంటున్నాయి. కొద్దిపాటి గాలివీచినా, జల్లులు పడినా లైన్లు బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. ముఖ్యంగా మర్రికుంటపల్లి ఫీడరు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుంది. దీనికి పీసీపల్లి ఫీడరు కూడా కలిసి ఉంది. అక్కడ లైన్‌మన్ లేకపోవడంతో ఆ ఫీడర్‌లో సమస్య ఏర్పడినప్పుడు ఆపరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఒకటిరెండు రోజులు చీకట్లోనే గడపాల్సి వస్తుంది. వెంటనే సిబ్బందిని నియమించి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి.

నిరుపయోగంగా చెత్త తరలింపు ఆటోలు



దర్శి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ఆటోలు

దర్శి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అందజేసిన చెత్తతరలింపు ఆటోలు నిరుపయోగంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు చెత్త తరలింపు ఆటోలను కేటాయించారు. కొన్ని పంచాయతీలకు ఆటోలను అందజేశారు. అధికారులనిర్లక్ష్యంతో పంచాయతీలకు పంపిణీ కాని ఆటోలు అలానేవున్నాయి. ఏళ్ల తరబడి ఆటోలను వాడకపోవటంతో సామాన్లు తుప్పుపట్టి పోతున్నాయి. లక్షలాది రూపాయ ప్రజాధనం వృథా అవుతుంది. టీడీపీ కూటమి ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నది. తడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటుచేసిన ఆటోలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

దొనకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నిగ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు యేసుప్రభువును స్మరించుకుంటూ శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దొనకొండ ఆర్సీఎం చర్చిలో సంఘకాపరి రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో శిలువయాగం కార్యక్రమం చేపట్టారు. చర్చి ఆవరణలో 14 స్థలాలను ఏర్పాటుచేసి శిలువను మోస్తూ యేసుక్రీస్తు పడిన కష్టాలను వివరిస్తూ స్లీవమార్గం నిర్వహించారు. ఆర్సీఎం చర్చిలో రెవరండ్ ఫాదర్ థామస్, ఏబీఎం చర్చిలో రెవరండ్ పాస్టర్ ప్రభుదాస్, సీఎస్ఐ చర్చిలో రెవరండ్ పాస్టర్ షడ్రక్, లూతరన్ చర్చిలో రెవరండ్ పాస్టర్ మధు, క్రీస్తుసంఘం చర్చిలో రెవరండ్ పాస్టర్ జె.జయరావు, గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు త్యాగాలను మననం చేసుకున్నారు. స్థానిక సియోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ గొంగటి జాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. సంఘపెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తూ ప్రభువైన ఏసుక్రీస్తూ చేసిన త్యాగానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటామని సందేశమిచ్చారు. సమస్త మానవాళి కోసం ప్రాణత్యాగం చేసిన ప్రభువును స్మరించుకోవాలన్నారు.



దొనకొండ ఆర్సీఎం చర్చిలో శిలువను మోస్తున్న దృశ్యం

తాళ్లూరులో.. తాళ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. తాళ్లూరు, దోసకాయలపాడు, శివరాంపురం, నాగంబొట్లపాలెం, రమణాలవారిపాలెం, తూర్పుగంగవరం, లక్కవరం, వెలుగువారిపాలెం తదితర గ్రామాల్లో చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాళ్లూరు చర్చిలో పాస్టర్ ప్రభుదాసులు ప్రార్థనలు జరిపారు.

కనిగిరిలో.. కనిగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు ఘనంగా జరుపు కున్నారు. స్థానిక దుర్గం బాప్టిస్ చర్చి, టకారిపాలెం సియోనో ప్రార్థనా మందిరంతో పాటు పలు చర్చిలలో ప్రార్థనలు జరిగాయి. యువకులు శిలువను మోస్తూ, ఏసు కీర్తనలను ఆలపిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సియోను ప్రార్థనా మందిరంలో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నిలిచిన సాగర్ నీటి సరఫరా

» ఇబ్బందులు పడుతున్న 190 గ్రామాల ప్రజలు

కనిగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నీటి సరఫరా నిలిచిపోయి గత నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. నాలుగు రోజులుగా నీటి సరఫరా లేకపోవటంతో ప్రజలు వాటర్ ప్లాంట్ నీటిని ఆశ్రయిస్తున్నారు. వేసవి కాలం కావటంతో పాటు నీటి సరఫరా నిలచిపోవటంతో ప్లాంట్ నిర్వాహకులు బబుల్ రేట్లు పెంచారు. చేసేది లేక అదనంగా రేట్లు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బబుల్ నీటిని రూ.15 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో నీటి కోసం రోజుకు రూ.50 వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ నీటి సరఫరా ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పీసీపల్లి, పామూరుతో పాటు వెలిగండ్ల మండలాలలకు ఫేజ్ 1, 2 ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా లేకపోవటంతో దాదాపు నాలుగు మండలాల్లోని 190 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కనిగిరి, పామూరు లాంటి పట్టణ కేంద్రాల్లో ప్రజలు వాటర్‌ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. అవి ఎంతవరకు సురక్షితమైనవో అర్థంకాని పరిస్థితి. చేసేది లేక ప్రజలు వాటినే తాగుతున్నారు. ప్లాంట్ నిర్వాహకులు చేపట్టాల్సిన నిబంధనలను ఎంతవరకు పాటిస్తున్నారో సంబంధిత అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు.

పైపుల మరమ్మతులతో నిలిచిన నీటి సరఫరా

రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన పనులతో రామతీర్థం నుంచి వచ్చే పైపులు పగిలిపోయినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విశ్వనాధరెడ్డి తెలిపారు. ప్రధాన పైప్ లైన్ బాగా దెబ్బతిన్న ప్రదేశాల్లో పనులు చేపట్టినట్టు చెప్పారు. ఇతర ప్రదేశాల్లో పైపులైను లీకులు, పునుగోడు హెడ్‌వర్క్స్, మాచవరం పంప్ హౌస్‌లలో మోటార్ పంపు సెట్ల మరమ్మతులు చేపట్టామన్నారు. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈనెల 23 నాటికి మరమ్మతులు పూర్తిచేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని ఈఈ కోరారు.



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

» నిధుల కొరతతో ముందుకుసాగని వైనం
» ఇరుకు గదుల్లో చిన్నారుల అవస్థలు

తాళ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన భవనాలు ఏళ్లతరబడి అసంపూర్తిగా ఉన్నాయి. దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తాళ్లూరు మండలంలో గత రెండు ప్రభుత్వాల్లో 14 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. టీడీపీ ప్రభుత్వ కాలంలో మంజూరయిన భవనాల పనులు కొంతమేర జరిగాయి. గత వైసీపీ పాలనలో నాడు- నేడు కింద మరో నాలుగు భవనాలు మంజూరుకాగా, కొంత మేర పనులు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ కాలంలో పనులు జరుగుతుండగా ప్రభుత్వం మారటంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తారు. ఆరోగ్య సూచనలు చేస్తారు. అయితే, భవన నిర్మాణాలు పూర్తికాకపోవటంతో అంగన్‌వాడీకేంద్రాలు చాలీచాలని అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ పాలనలో మండలంలో పది అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరుకాగా భవనాలు నిర్మాణదశల్లో ఉన్నాయి. గతంలో చేపట్టిన పనులు తప్ప గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆభవనాలు పూర్తి చేసిన పాపానపోలేదు. మండలంలో తాళ్లూరు-1, శివరాంపురం-1,శివరాంపురం-3, రామభద్రాపురం, లక్కవరం-4, దోసకాయలపాడు, సోమవరప్పాడుడు-1, తురకపాలెం-2, గత వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు పథకం కింద మల్కాపురం, తాళ్లూరు, లక్కవరం, బొద్దికూరపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు నిధులు మంజూరయ్యాయి. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవటంతో పనులు పూర్తి చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వకాలంలో చేసిన పనులకు నిధులు రాక పోవటం, బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోకపోవటంతో అసంపూర్తిగా పనులను పూర్తి చేసేందుకు నిర్వాహకులు ముందుకు రాలేదు. చాలీచాలనీ అద్దె గదుల్లో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అంపూర్తిగా ఉన్న భవనాలకు నిధులు మంజూరుచేసి పనులు పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు. ఈ భవనాలను వినియోగంలోకి తీసుక వచ్చి చిన్నారులు, గర్భిణుల అవస్థలు తొలగించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- సీహెచ్ భారతి, సీడీపీవో

తాళ్లూరు మండలంలో 14 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భవన నిర్మాణాలు ముందుకు సాగక పోవటంతో ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంది. చాలీచాలని వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

ముఖాముఖి

వేసవిలో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టి.త్యాగరాజు, ఎస్ఐ, దొనకొండ



ప్రశ్న:వేసవిలో దొంగతనాల నియంత్రణకు ఎటువంటి జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు ?

జవాబు: వేసవిలో ఆరు బయట పడుకునే వారు జాగ్రత్తగా ఇంటికి తాళాలు వేసుకొని ఇంట్లో విలువైన వస్తువులు భద్రం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రాత్రివేళల్లో పోలీసు బీటు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను చైతన్యపరుస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయిందా ?

జ: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, దేవాలయాలు, చర్చీలు, మసీదుల వద్ద గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

ప్ర: శక్తియాప్ పట్ల అవగాహన కల్పిస్తున్నారా ?

జ: మహిళల రక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్ వల్ల మహిళలకు కలిగే ప్రయోజనాలను ప్రతిరోజు మహిళా పోలీసుల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వారి మొబైల్స్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

అరకొరగా రేషన్ పంపిణీ

తాళ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డుదారులకు ఏప్రిల్ నెలలో పూర్తిస్థాయిలో బియ్యం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బఫర్ విధానంతో రేషన్ షాపులకు బియ్యం సరఫరా అస్తవ్యస్తంగా మారింది. మండలంలో 32 రేషన్ షాపుల్లో 14,283 కార్డులు ఉన్నాయి. ఈనెల తక్కువగా రేషన్ సరఫరా కావటంతో కార్డుదారులందరికి రేషన్ పంపిణీ చేయలేదు. కార్డుదారులందరికి రేషన్ సరఫరా జరిగేలా చూడాలని కార్డుదారులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ కె.సంజీవరావును వివరణ కోరగా షాపులకు 80 శాతం మాత్రమే రేషన్ సరఫరా జరిగిందని తెలిపారు. తరుగుదలలో మరో పదిశాతం పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. డీలర్ల దరఖాస్తులు పెట్టుకోగా రేషన్ బియ్యం పెంపునకు సివిల్ సప్లయ్ అధికారులకు నివేదికలు పంపామన్నారు. త్వరలో రేషన్ సరఫరా చేస్తారన్నారు.

పూర్వవిద్యార్థుల సమావేశం

పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఉత్సాహంగా గడిపారు. 1987-88లో పదో తరగతి చదివిన విద్యార్థులు త్వరలో నిర్వహించుకొనే ఆత్మీయ సమ్మేళనం కోసం స్థానిక ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, అధ్యాపకుడు గుత్తి రమణయ్య మాట్లాడుతు జన్మభూమికి, విద్యనేర్పిన పాఠశాలకు, ఆర్థికలేమితో ఇబ్బందిపడుతున్న స్నేహితులకు చేయూత అందించి ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతిరెడ్డి, బత్తుల నాగేశ్వరరావు, షేక్ ఖాదర్‌బాషా, గౌస్ బాషా, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీల నియంత్రణ, గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. ఎస్పీ ఏఆర్ దామోదరం ఆదేశాలతో శుక్రవారం పట్టణంలోని నెల్లూరు రోడ్డు కూడలిలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, అనుమానిత వాహనాలు మండలంలో ఎక్కడైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కిశోర్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బొట్లగూడూరుకు చెత్తసేకరణ ట్రాక్టర్ మంజూరు

పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ మిషన్ నిధుల ద్వారా మంజూరైన ట్రాక్టర్‌ను మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కేటాయించారు. బొట్లగూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రఘునాధపురం, బొంపెద్దుపాడు, రంగస్వామిపాకాల, కొత్తపల్లి గ్రామాల్లోని చెత్త సేకరణకు ఈ ట్రాక్టర్ ఉపయోగించుకోవాలన్నారు. కనిగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జీవీ అరవింద, సర్పంచ్ వై.బాల, పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిల్లచెట్ల తొలగింపు

వెలిగండ్ల, ఏప్రిల్ 18. (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అంతరాయంగా ఉన్న చిల్లచెట్లను సిబ్బంది తొలగించారు. గురువారం మండలంలోని కొటాలపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో గడ్డివామి దగ్ధమైంది. ఈక్రమంలో శుక్రవారం విద్యుత్ సిబ్బంది గ్రామంలో విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ వైర్లను సరిచేసి సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు.

నిరుపయోగంగా జనరేటర్



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వృథాగా పడిఉన్న జనరేటర్

పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు పదేళ్ల క్రితం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలకు జనరేటర్లు కేటాయించారు. వాటి నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో అధికారులు వాటి నిర్వహణను గాలి కొదిలేశారు. జనరేటర్లు కేటాయించినా వాటి వినియోగానికి అయ్యే డీజిల్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. ఆ ఖర్చు ఎవరు భరాయించాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో సమస్యగా మారింది. వృథాగా పడిఉన్న జనరేటర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పడేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టి నిరుపయోగంగా మారింది.

ఆశాజనకంగాలేని పుచ్చకాయల దిగుబడి



పామూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకొన్న మార్పులతో పుచ్చకాయల దిగుబడి ఆశాజనకంగా లేదు. పెట్టిన పెట్టుబడులైన వస్తాయో, లేవోనని రైతులు దిగాలు చెందుతున్నారు. పామూరు మండలంలోని దూబగుంట పంచాయతీకి చెందిన ఉడుముల ప్రభాకర్‌రెడ్డి 13 ఎకరాల్లో పుచ్చకాయ సాగుచేశాడు. 13 ఎకరాలకు గాను సుమారు రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాడు. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల పైబడి దిగుబడి రావాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గింది. కొత్తగా పుచ్చకాయలను సాగు చేసిన ప్రాంతాల్లో దిగుబడి ఆశాజనకంగా ఉంది.

కొన్ని సంవత్సరాలుగా ఒకే పంటను సాగుచేస్తుండటంతో దిగుబడి తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. పొద్దుటూరు, కడప, పోరుమామిళ్ల, బద్వేలు, తదితర ప్రాంతాల నుంచి పుచ్చకాయల సరుకు పామూరుకు వస్తుండటంతో ధర అనుకున్నంతగా ఉండటం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కేజి పుచ్చకాయలు రూ.15కే విక్రయిస్తున్నట్టు తెలిపారు. బయట ప్రాంత వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోలేక, తామే ట్రాక్టర్ ద్వారా ప్రతిరోజు లోడును తెచ్చి కేజీల లెక్కన అమ్ముకుంటున్నట్టు రైతు ప్రభాకర్ తెలిపారు. పెట్టిన పెట్టుబడులు, కూలీ వస్తే చాలని ఆయన పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కనిగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ ఎస్ఐ బంగారుబాబు అన్నారు. స్థానిక బారత్‌గ్యాస్ గోడౌన్ వద్ద గ్యాస్ సిలిండర్ వల్ల జరిగే ప్రమాదాల నియంత్రణపై శుక్రవారం గ్యాస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకైనపుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డు నిర్మాణంతో తీరిన ప్రయాణికుల కష్టాలు



తూర్పుగంగవరం వద్ద వేసిన తారు రోడ్డు

తాళ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు-తూర్పుగంగవరం మార్గంలో కిలోమీటర్ పొడవున అసంపూర్తిగాఉన్న తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేశారు. తాళ్లూరు నుంచి తూర్పుగంగవరం వరకు ఆరు కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డులో 5వ కిలోమీటర్ మైలురాయి వరకు తారు నిర్మాణం మూడు నెలల కిత్రం పూర్తయింది. మిగిలిన కిలోమీటర్ రోడ్డు మరో కాంట్రాక్టర్‌కు దక్కటంతో కొంతమేర పూర్తిచేసి అసంపూర్తిగా వదిలి వేశారు. దీంతో ఆమార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణి కులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ పూర్తిచేశారు. దీంతో ఈమార్గంలో ప్రయాణికుల కష్టాలు తొలగిపోయాయి.

ముందుకు కదలని మురుగు

» కంపు కొడుతున్న పసుపుగల్లు వీధులు



పసుపుగల్లులోని ప్రధాన సెంటర్‌లో కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు

ముండ్లమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీలో పలు వీధుల్లో మురుగునీరు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు అల్లాడి పోతున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే వాసన భరించలేక ముక్కు మూసుకొని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహించటం వల్ల ప్రయోజనం ఉండటంలేదు.

ప్రధానంగా బస్టాండ్ సెంటర్‌లో మురుగు కాలువల్లో మురుగు నీరు పేరుకు పోయింది. చింతవారి కొత్తూరులో చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారి మురుగు కాలువలు పూడికపోయి రోడ్ల పైకి మురుగు వస్తుంది. అదే వీధిలోని మరో ప్రధాన వీధిలోని సైడు కాలువ పూడిపోయి మురుగు నీరు వెళ్ళే పరిస్థితి లేక ఇళ్ల ముందుకు నీరు వస్తుంది. పాతూరులోని ఎస్సీ కాలనీలో కూడా వీధులన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





ఉష్ణోగ్రత (అంచనా)

19-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	36	29
రెంటచింతల	42	28

కోలాహలంగా..

ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం

- విజేతలకు బహుమతులు అందజేసిన వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్
- ప్రథమ బహుమతిగా బైకు, ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా కలర్ టీవీ అందజేత
- 125 మందికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం.. విజేతల్లో ఆనందోత్సాహాలు







యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతి, బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి,దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిని అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానో త్సవం కోలాహల వాతావరణంలో జరిగింది. శుక్రవారం గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అంద జేశారు. గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో ముద్రితమైన కూపన్లను పాఠకులు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి ఆధ్వర్యంలో ఆయా కూపన్లలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయా విజేతలకు శుక్రవారం ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, పాఠకుల సమక్షంలో బహుమతులను అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతిగా బైకును అందజేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన ఎస్‌డీబీ బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి కింద ఫ్రిడ్జ్ అందచేశారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిగా కలర్ టీవీని అందజేశారు. మరో 125 మందికి ప్రోత్సాహక బహుమ తులుగా వివిధ రకాల గృహోపకరణాలను అందజేశారు.

ఆంధ్రజ్యోతి కార్యక్రమాలు గర్వకారణం : విద్యాసాగర్

నేటి సమాజంలో పఠనాసక్తి తగ్గుతున్న క్రమంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. లక్కీడ్రాలు నిర్వహిస్తూ పాఠకులకు బహుమతులు అందజేయడం విశేషమ న్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పత్రికా పఠనాన్ని ఆంధ్ర జ్యోతి ప్రోత్సహిస్తుందన్నారు. నేటి సమాజంలో పత్రికల ద్వారానే వాస్తవాలు తెలుస్తాయని తెలిపారు. సమాజానికి దిక్సూచిలా పత్రికలు పనిచేస్తున్నాయన్నారు. నేటి ఆధునిక సమాజంలో పత్రికలు ఆవశ్యకత ఎంతో ముఖ్యమైనదని (మిగతా 8వ పేజీలో)



పుడమికి.. పరీక్షలు

ఈ పరీక్షలు చేస్తారు..

నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా నేలల్లోని లోపాల ఆధారంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పోషకాలు వాడకం.. పంటల సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తారు.

అవగాహన లేమితో కొందరు.. అధిక దిగుబడుల కోసమని మరికొందరు ఇష్టం వచ్చినట్లుగా.. అవసరం లేకపోయినా రసాయన ఎరువులను వాడుతూ భూ సారాన్ని నిస్సారం చేసేస్తున్నారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న పుడమిని పరీక్షించి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అటు నేల తల్లిని రక్షించి.. ఇటు రైతులను ఆదుకునేలా ప్రభుత్వం భూ ఆరోగ్య పరీక్షలపై దృష్టి సారించింది. సకల పోషకాలకు నెలవుగా ఉండాల్సిన భూమి రసాయనాలతో నాశనమవగా భూ సారం నానాటికీ తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ పరిస్థితుల్లో నేలలో ఏఏ పోషకాలు లోపించాయో గుర్తించి వాటిని మాత్రమే వినియో గించేలా రైతులకు చెప్పి వారిని చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. సాయిల్ టెస్ట్‌లు చేసి మే 15వ తేదీ కల్లా హెల్త్ కార్డులను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యంగా నిర్దేశించింది. అయితే భూసార పరీక్షలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

- భూ ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- వచ్చే నెల 15 కల్లా హెల్త్ కార్డుల జారీ
- మూడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యం
- సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక



నరసరావుపేటలోని భూసార పరీక్షా కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా పరీక్షల ఆధారంగా భూ సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి కీలకమైన పుడమి ఆరోగ్య పరీక్షలకు వ్యవసాయ శాఖ సమాత్తమైంది. పంటలు సాగుకు ముందే మట్టి (మిగతా 8వ పేజీలో)



గుంటూరులో సందేశం ఇస్తున్న బిషప్ భాగ్యయ్య

భక్తిశ్రద్ధలతో.. శుభ శుక్రవారం

- చర్చిలు, సమాధుల తోటల్లో ప్రార్థనలు

బాపట్ల, ఏప్రిల్ 18: శుభ శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) వేడుకలు జిల్లావ్యాప్తంగా అ త్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని చర్చిలు, అన్ని ప్రాం తా ల్లోని సమాధుల తోటల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు శిలువ మరణం పొందిన గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నాటి క్రీస్తుశ్ర మలు, కష్టాలను గుర్తు తెచ్చుకుని కన్నీటి ప్రార్థనలు చేశా రు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి ప్రార్థనలు చేశారు. వారిని గుర్తు చేసుకుం టూ సమాధులపై పుష్పగుచ్ఛా లు ఉంచి క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. 40 రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన వారు ప్రార్థనల అనంతరం దీక్ష విర మించారు. అంతకముందు క్రైస్తవులు పలు ప్రాంతాల్లో శిలువయాత్ర నిర్వ హించారు.

శ్మశానవాటికకు దారి ఇవ్వండి

- అధికారులను ఆశ్రయించిన విజయనగర్ కాలనీ వాసులు



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మాణం జరుగుతున్న 167 ఏ జాతీయ రహదారిలో టన్నెల్ ఏర్పాటు చేసి ఉన్న శ్మశాన వాటికకు దారి కల్పించాలని స్థానిక విజయనగర్ కాలనీ వాసులు అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. సోమవారం చీరాల మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి గ్రీవెన్స్‌లో జాతీయ రహదారి నిర్మాణ అధికారుల సమక్షంలో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గస్తీకి.. సుస్తీ

- శిథిలావస్థలో స్పీడ్‌బోట్లు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత



సూర్యలంక : మెరైన్ పోలీసుస్టేషన్ వెనుక ఉంచిన స్పీడ్‌బోట్లు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరం ద్వారా చొరబాటుదారులు రాకుండా భద్రతా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 21చోట్ల మెరైన్ పోలీసుస్టేషన్‌లు (కోస్టల్ సెక్యూరిటి పోలీసుస్టేషన్) ఏర్పాటు చేశారు. ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో స్పీడ్‌బోట్లు ఏర్పాటు చేసి సముద్రజలాల్లో 12 నాటికల్ మైళ్ళ వరకు గస్తీ నిర్వహించేవిధంగా చర్యలు చేపట్టారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో మొత్తం 18 స్పీడ్‌బోట్‌లను ఇచ్చారు. వాటిల్లో ఒకటి కూడా ఇప్పుడు పనిచేసే పరిస్థితి కనిపించటంలేదు. సూర్యలంక సముద్రతీరంలో 2008వ సంవత్సరంలో మెరైన్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసి మూడు స్పీడ్‌బోట్లు కేటాయించారు. ఒక్కొక్క స్పీడ్‌బోటు ఖరీదు 70లక్షల రూపాయలు నుంచి కోటి రూపాయల వరకు ఉంటుంది. వీటి ద్వారా మెరైన్ సిబ్బంది సముద్రజలాలలో గస్తీ తిరుగుతూ కొత్త వ్యక్తులు, చొరబాటు దారులను గుర్తించి చర్యలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ బోట్లను నిజాంపట్నం జెట్టి దగ్గర ఉంచేవారు. ఒక్కొక్క బోటులో నలుగురు సిబ్బంది ఉండేవారు. 10



హెచ్‌పీ బోట్లు రెండు, 5హెచ్‌పి బోటు ఒకటి చొప్పున ఉండేది. ప్రస్తుతం మూడు పనిచేయకపోవటంతో తీసుకొచ్చి సూర్యలంకలోని మెరైన్ పోలీసుస్టేషన్ వెనుక పెట్టారు. ఇవి ఉప్పుగాలికి తుప్పు పట్టి పోతున్నాయి. ఇలాగే వీటిని వదిలేస్తే పనికిరాకుండా పోయేప్రమాదం ఉంది. 2017వ సంవత్సరం నుంచి వీటి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అప్పటి నుంచి ఉన్నతాధికారులు, పాలకులు వీటిపై దృష్టిపెట్టలేదు. తీరంలో గస్తీ ముమ్మరం చేస్తున్నాం. చొరబాటుదారులు రాకుండా చర్యలు చేపడుతామంటూ చెప్పేవారంతా వీటి విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కొక్కబోటుతో నెలరోజులు గస్తీ నిర్వహించేందుకు 2లక్షల రూపాయల ఆయిల్ ఖర్చు అవుతుంది. నలుగురు సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. కేవలం ఆయిల్ ఖర్చు పెట్టలేక, సిబ్బంది నియామకం చేపట్టక పోవటం వల్లే వీటిని నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి.

సిబ్బంది కొరత

సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ళు, 8 మంది కానిస్టేబుళ్ళు, ఆరుగురు హోం గార్డులు పనిచేస్తున్నారు. ఇంకా 17 మంది కానిస్టేబుళ్ళను భర్తీ చేయాల్సి ఉంది. స్పడ్‌బోట్లు నడిపేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రస్తుతం స్పీడ్‌బోట్లు పనిచేయకపోవటంతో ఆల్‌టెరైన్ వెహికల్స్ రెండు ఏర్పాటు చేయాలని మెరైన్‌సిబ్బంది ఇటీవల కలెక్టరేట్‌లో విజ్ఞప్తి చేశారు. వాటి ద్వారా బోర్డర్‌లో గస్తీ తిరగటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కావున సంబంధితాధికారులు దీనిపై దృష్టిసారించి గస్తీకి తగిన ఏర్పాట్లు చేయటంతోపాటు అవసరమైన సిబ్బందిని భర్తీ చేయాలని తీరవాసులు కోరుతున్నారు.

కలుషిత నీటితో అవస్థలు

- పర్చూరు ప్రాంతంలో మరమ్మతులకు నోచని ఫిల్టర్ బెడ్‌లు

పర్చూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటిని సద్వినియోగ పరుచుకోలేదు. దీని కారణంగా నియోజకవర్గం వ్యాప్తంగా పిల్టర్ బెడ్‌లు పని చేయడం లేదు. దీంతో చెరువుల్లోని నీటిని శుద్ధిచేయకుండా ఓవర్



రంగుమారి ఫిల్టర్ బెడ్‌లలో సరఫరాకు సిద్ధంగా ఉన్న నీరు

హెడ్ ట్యాంకులకు ఎక్కించి నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని చెరువుల్లో నీరు చిక్కపడి కలుషితంగా మారాయి. ప్రజలకు సరఫరా చేసిన నీరు రెండు రోజులకే పాచిపడుతోంది. పర్చూరులో ఉన్న నాలుగు ఫిల్టర్‌బెడ్‌లలో కనీసం ఇసుక కూడా మార్చలేదంటే వాటి వినియోగం ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్చూరు నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల్లో ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు జలజీవన్ నిధులు వినియోగించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించి మార్గ నిర్దేశం చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించి 81 పనులకు గాను రూ.36.56 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. ఈనిధులతో ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులు, అవసరమైన చోట పైపులైన్ ఏర్పాటు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు, చెరువులకు నీటి సరఫరా జరిగేలా పైపులైన్ నిర్మాణాలకు సంబంధించి అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వెంటనే పనులు ప్రారంభించి శుద్ధ జలం ప్రజలకు అందేలా చర్యలు వేగవంతం చేశారు.



నీరు లేని ఫిల్టర్ బెడ్



బాపట్ల చీలు రోడ్డు సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- 136 వాహనాలు సీజ్
- 14 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
- 268 వాహనాలకు జరిమానాలు

బాపట్ల , ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గురువాం రాత్రి జిల్లాలోని వివిధ ప్రదేశాలలో ఏకకాలంలో పోలీసు అధికారులు నాకాబందీ నిర్వహిం చారు. ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆయాస్టేషన్‌ల పోలీసు సిబ్బంది కలిసి 3,799 వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని కారణంగా 136 వాహనాలను సీజ్ చేశారు. 14మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 268 వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ రవాణా, నేరాల నియంత్రణ లక్ష్యంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు సరైన ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చీరాల పట్టణంలోని గడియార స్తంభంసెంటర్, బస్టాండ్, పేరాలగేటు వద్ద, ఈపూరుపాలెంలో, బాపట్ల పట్టణంలోని చీలురోడ్డసెంటర్‌లలో నిర్వహించిన తనిఖీలలో ఎస్పీ స్వయంగా పాల్గొని వాహనాలను తనిఖీ చేసి అధికారులకు పలుసూచనలు చేశారు. అలాగే అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీలతో కలిసి జిల్లాలోని పలుచోట్ల వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు అడ్డుకట్టవేయటానికి అనుమానాస్పద వ్యక్తులు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవటానికి, ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించటానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు తనిఖీలు చేయటం జరిగిందన్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను, వాహనచట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. సరైన ధ్రువపత్రాలు కలిగియుండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవీ.. ఇవీ



కుట్టు మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

మహిళలు ఆర్థికంగా బలపడాలి

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యాపారంతో ఆర్థికంగా బలపడి, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళల ఉపాధి కల్పనకు విశేషంగా కృషిచేస్తున్నదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం వేటపాలెం మండల కార్యాలయం, తోట వారి పాలెం సచివాలయం 2లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. అలాగే వ్యక్తిగత నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం చీరాలనగర్ వీర్ల అంకమ్మతల్లి సంబరాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంకొల్లులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముస్లింల శాంతి ర్యాలీ

● వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్

ఇంకొల్లు,ఏప్రిల్ 18,(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడం ముస్లింల మత స్వేచ్ఛపై దాడి చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకొల్లులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం భారీశాంతి ర్యాలీ నిర్వహించారు.అధికసంఖ్యలో ముస్లింలు పాల్గొని నినాదాలు చేశారు. కేంద్రప్రభుత్వ విధానాలపై వారు మండిపడ్డారు. వక్ఫ్ చట్ట సవరణ ముస్లింల హక్కులను హరించే విధంగా ఉన్నదన్నారు. ముస్లిం ఆస్తులు ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికే ఈ వక్ఫ్ సవరణ చేశారని వారు ఆరోపించారు.వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకొల్లులో స్థూపం నుంచి జరిగిన ఈ శాంతియుత ర్యాలీలో స్థానిక ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పూజారులతో చర్చిస్తున్న ఈవో తిమ్మానాయుడు

అందరి సహకారంతో మహాకుంభాభిషేకం

అద్దంకి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపం పునఃనిర్మాణం సందర్భంగా మే 19 వ తేదీ జరిగే మహాకుంభాభిషేకం విజయవంతం అయ్యేందుకు అందరి సహకారం తీసుకుంటామని ఈవో ,అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు అన్నారు. ఏర్పాట్లు, పూజా కార్యక్రమాల నిర్వహణపై పూజారులతోఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పూజా కార్య క్రమాలు, హోమాలు ఏయే ప్రాంతాలలో నిర్వహించాలో చర్చించారు. శృంగేరి పీఠాధిపతి, శిష్య బృందం విడిది ఏర్పాట్లపై చర్చించారు. వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, మిగిలిన పూజారులు పాల్గొన్నారు.

వేగంగా అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు

రాజుపాలెం,జొన్నతాళి క్రాస్ రోడ్డుల వద్ద ప్రారంభం

ఏడాదిలోగా పనుల పూర్తికి ప్రణాళికలు

మార్టూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి ఒంగోలు వెళ్లే 216వ నంబరు జాతీయరహదారిపై బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలో రెండు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు మంజూరుచేసిన 67 కోట్ల వ్యయంతో రాజుపాలెం క్రాస్ రోడ్డు,జొన్నతాళి క్రాస్ రోడ్డుల వద్ద అండరుపాస్ పనులు చేపట్టారు. రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద పెద్ద అండర్‌పాస్ (వీయూపి),జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండర్‌పాస్ (ఎల్వీయూపీ) ఏర్పాటు చేస్తున్నారు. 20 రోజుల నుంచి సంబంధిత కాంట్రాక్టరు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులను ప్రారంభించారు.అందుకు సంబంధించి రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయరహదారిపై వెళ్లే వాహనదారులకు,స్థానికంగా వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా జాతీయరహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. దాదాపుగా రాజుపాలెం క్రాస్ రోడ్డునుంచి చిలకలూరిపేట వైపు యలవర్తి కోల్డ్‌స్టోరేజీ సమీపం వరకు తూర్పువైపున సర్వీసు రోడ్డు పనులను చేపట్టారు. అంతేగాకుండా క్రాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న రెస్ట్ ఏరియా ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న రెండు బ్రిడ్జీలకు సమాంతరంగా మరో రెండు ఎంఎన్‌డీ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రయత్నాలు మొదలెట్టారు. రాజుపాలెం క్రాస్ రోడ్డు కు యద్దనపూడి మండలం వైపునుంచి,మార్టూరు టౌన్ నుంచి, బల్లికురం మండలం నుంచి రాజుపాలెం గ్రామం మీదుగా వాహనాలు వస్తున్నందున అందుకు తగినట్లుగా భవిష్యత్తులో వాహనదారులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటుచేస్తున్నారు. ఇంకా జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండరుపాస్ ఏర్పాటుకు జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్డు ఏర్పాటుకు హైవే రోడ్డుపై ఇరువైపులా కొంతమేర ఇనుపగ్రిల్స్‌ను తొలగించారు.అందుకు సంబంధించి పనులను చేపడుతున్నారు.





రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద అండర్ పాస్ నిర్మాణం కోసం తూర్పువైపున ఏర్పాటుచేసిన సర్వీసు రోడ్డు (ఇన్‌సెట్లో) మైనింగ్ బ్రిడ్జి ఏర్పాటు పనుల్లో సిబ్బంది

విద్యుదాఘాతంతో ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ మృతి

● స్తంభం ఎక్కుతూ జారి పడి మృతి చెందాడంటున్న అధికారులు



మృతి చెందిన పులి నెహేమియా

అద్దంకి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ పులి నెహేమియా(42) మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబం కథనం మేరకు మండలంలోని చినకొత్తపల్లికి చెందిన పులి నెహేమియా గత 15 సంవత్సరాలు గా ప్రయివేట్ ఎలక్ట్రీషియన్‌గా పంచాయతీ వీధి దీపాలు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో జొన్నలగడ్డ రామాంజనేయులుకు చెందిన రైస్‌మిల్‌కు విద్యుత్ సరఫరా రావటం లేదని చెప్పటంతో వెళ్లాడు. విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ఎల్‌సీ తీసుకొని రైస్ మిల్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కింద పడి పోయాడు. దీంతో స్థానికులు వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు. నెహేమియాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే నెహేమియా విద్యుత్‌స్తంభం ఎక్కుతూ పడిపోయి మృతి చెందాడని విద్యుత్ డీఈఈ దామోదరం ప్రకటించారు. విద్యుత్ లైన్ మరమ్మతులకు ప్రయివేట్ లైన్‌మెన్‌కు ఎల్‌సీ ఇవ్వటం పట్ల విమర్శలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తరువాత తమకు సంబంధం లేదని తప్పించుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

మలుపులో విద్యుత్ స్తంభాలు

● వాహనదారుల అవస్థలు



బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో సీసీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

బల్లికురవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల క్రితం బల్లికురవ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఇప్పుడు రోడ్డుపై ఉండటంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో మలుపులలో ఉన్న విద్యుత్ స్తంభాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. మార్టూరు వైపు నుంచి అద్దంకి వైపు వచ్చే మలుపులో రోడ్డుపైకి ఉన్న విద్యుత్ స్తంభాలను అనుకొని పెద్ద పెద్ద వాహనాలు మలుపులో వస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు వాహనాలు వెళ్లే వరకు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ఉంటున్నారు. విద్యుత్ లైన్ రోడ్డుకు దూరంగా వేసేందుకు అధికారులు రెండు మాసాల క్రితం ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసినా పనులు మాత్రం ఇంత వరకు చేపట్ట లేదని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోక పోవటం వలనే సమస్య నెలల తరబడి అలానే ఉందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను, స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పుడమికి పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు పూర్తి చేసి నేల హెల్త్ కార్డులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ధేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మే 15 కల్లా పరీక్షలు పూర్తి చేసి హెల్త్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. అయితే గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. బాపట్ల జిల్లాలో 17,201 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 10,800, పల్నాడు జిల్లాలో 17,700 భూసార పరీక్షలు నిర్వహించి రైతులు నేల ఆరోగ్య కార్డులను రైతులకు అందజేశారు. ఈ ఏడాది భూసార పరీక్షల లక్ష్యాలను పెంచారు. పల్నాడు జిల్లాలో 23,437, బాపట్ల జిల్లాలో 22,825, గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాల పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

గత ఏడాది లోపాలు ఇలా..

- గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో బాపట్ల జిల్లాలో నత్రజని, పాస్ఫరస్, ఇనుము, జింక్ మాంగనీస్, కార్బన్ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. పీహెచ్ విలువ తటస్థంగా ఉంది.

పరీక్షలు సరే.. పోషకాల పంపిణీ?

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం.

గతంలో టీడీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీని నిలిపేసింది. దీంతో రైతులు ఐదేళ్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

కోలాహలంగా.. ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్.రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ ఎం సుబ్బారావు, టెక్నికల్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది

ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో బహుమతి గెలుస్తామని అనుకోలేదు. ప్రథమ బహుమతి కింద బైకును గెలుపొందినట్లుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దీంతో చాలా సంతోషం కలిగింది. ఆంధ్రజ్యోతి పాఠకులుగా ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నాం. ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ న్యూస్ ఛానల్ అంటే ఎంతో ఇష్టం. ఎండీ రాధాకృష్ణ, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-యడ్లపల్లి గౌరి(ప్రథమ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి వార్తలు నచ్చుతాయి

పదిహేను సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడ్ని. ప్రతిరోజు క్రమం తప్పకుండా పేపర్ చదువుతా. ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు బాగా నచ్చుతాయి. ఎండీ రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

-(బిహారి సాహెబ్, ద్వితీయ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి పత్రిక అభిమానిని

కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌లో వచ్చే వార్తలు, చర్చలు, ఓపెన్ హార్ట్‌విత్ ఆర్కే వంటి కార్యక్రమాలు బాగా నచ్చుతాయి. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతాను. ఏబీఎన్‌లో వచ్చే న్యూస్ చూస్తుంటాము. తృతీయ బహుమతి కింద కలర్ టీవీ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- దొరడ్ల సుజాత(తృతీయ బహుమతి విజేత)

వృత్తి విద్య కోర్సులను సద్వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఉచిత వృత్తి విద్య కోర్సులను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని హెచ్ఎం పి. గంగాధరరావు అన్నారు. తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ (వృత్తి విద్య) ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ కోర్సులలో భాగంగా పదో తరగతి పూర్తి చేసిన 29 మంది విద్యార్థులు శిక్షణ పొందుతుండగా శుక్రవారం ఆయన వారితో మాట్లాడారు. శిక్షణ శనివారంతో పూర్తవుతుందని, అనంతరం విద్యార్థులకు ఎస్ఎస్ఏ ద్వారా సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని అద్దంకి నార్త్(శింగరకొండ రోడ్డు) విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టౌన్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కాకానిపాలెం, భవానిసెంటర్, మెయిన్‌రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, శింగరకొండ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

బల్లికురవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు(50) అనే కూలీ మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయన బంధువులు తొలుత చిలకలూరిపేటలోని వైద్యశాలకు, అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం కూలీ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

నాగార్పమ్మ ఆలయానికి గేటు బహూకరణ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలోని నాగార్పమ్మ ఆలయానికి పెరిశెట్ల తులసీ ప్రసాద్, అహల్య దేవి దంపతులు వారి పూర్వీకుల జ్ఞాపకార్థం సుమారు రూ.55 వేల ఖరీదు గల స్టీల్ గేటును బహూకరించారు. దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పేరాల పోలేరమ్మ 50వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా శనివారం నుంచి మంగళవారం వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు ఇప్పటికే పూర్తి చేశారు. శనివారం సాయంత్రం కలశంతో గ్రామోత్సవం, ఆది, సోమవారాలు అమ్మవారికి జల బిందెల కార్యక్రమం, మంగళవారం సిడిమాను ఉత్సవం, చింతామణి నాటిక, హరిశ్చంద్ర కాటి సీను, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మునిసిపల్ పరిధిలోని జేజేపేట, ఉజిలీపేట చర్చిల్లో నిర్వహించిన పవిత్ర ప్రార్థనల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. వేటపాలెం రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు విశేషంగా హాజరయ్యారు. అలాగే వీధుల్లో క్రీస్తు శిలువతో ర్యాలీ నిర్వహించారు.

ఇంకొల్లు : గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలోని చర్చిలలో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యత గురించి వివరించారు.అనంతరం ఏసు క్రీస్తు వేషధారణలో శిలువ మోస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కారంచేడు(పర్చూరు): కారంచేడు ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో క్రైస్తవులు శిలువ యాత్ర నిర్వహించారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై మాల్యాద్రి, పోలీసులు

కొమర్నేనివారిపాలెంలో చోరీ

● 15 సవర్ల బంగారం , రూ.10వేల నగదు అపహరణ

కొమర్నేనివారిలెం(పర్చూరు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పర్చూరు మండలం కొమర్నేనివారిపాలెంలో శుక్రవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన యర్ర వెంకటసుబ్బయ్యకు చెందిన నివాసంలో గురువారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న 15 సవర్ల బంగారు అభరణాలు, రూ.10వేలకు పైగా నగదుతోపాటు, రూ.50వేల విలువ చేసే ఎల్ఈడీ టీవీతో పరారయ్యారు. వెంకటసుబ్బయ్యకు ఆరోగ్యం సరిగా లేకపోవటంతో భార్య ఝాన్సీతో కలసి ఆసుపత్రి అందుబాటులో ఉంటుందన్న ఉద్దేశంలో చీరాలలో నివాసం ఉంటున్నారు. అయితే గ్రామంలో ఉంటున్న ఝాన్సీ మేనత్త గురువారం రాత్రి చనిపోవటంతో చీరాల నుంచి కొమర్నేనివారి పాలెం వచ్చారు. శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటంతో ఒక్కసారిగా ఆందోళనకు గురిఅయ్యారు. భార్యతో కలసి ఇంటిలో చూడగా బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, టీవీ చోరీకి గురిఅయ్యాయని తెలుసుకొని బంధువుల సహాయంలో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్సై మాల్యాద్రి సిబ్బందితో కలసి చోరీ జరిగిన నివాసాన్ని పరిశీలించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులుకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీతోపాటు, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బాపట్ల క్లూస్ టీంకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చిన నమూనాలు సేకరించారు.

స్థల వివాదంపై కేసుల నమోదు

మార్టూరు,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద స్థలం వివాదంపై మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఎస్‌కె నాగూర్, ఎస్‌కె రహమాన్ అనే ఇద్దరు వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఆమేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదా శుక్రవారం తెలిపారు. ఈ నెల 16 వతేదీ రాత్రి ఇంటి దగ్గర పాత కక్షల నేపథ్యంలో నాగూర్,రహమాన్‌లు వారి బంధువులతో కలిసి కర్రలతో దాడి చేసి కొట్టుకున్నారు. ఇరువర్గాలకు గాయాలయ్యాయి. వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్టూరు ఎంఆర్ఎఫ్ షోరూంలో చోరీ

మార్టూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఎంఆర్ఎఫ్ షోరూంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు శుక్రవారం షాపు యజమాని కొల్లా రాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం వేకువజామున సుమారు 3గంటలు సమయంలో బుల్లెట్‌పై వచ్చిన ఇద్దరు యువకులు షాపునకు ఉన్న షట్టర్ తాళాలను పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. షాపులో ఉన్న సుమారు 50 వేల రూపాయల నగదును తీసుకువెళ్లారు. ఉదయం షాపు తీయడానికి వచ్చిన యజమాని దొంగతనం జరిగిందని భావించి సీసీ ఫుటేజిని పరిశీలించారు. అనంతరం ఈ విషయంపై స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ

● క్యాబిన్‌లో చిక్కుకుపోయిన డ్రైవర్

● రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు



నుజ్జునుజ్జయిన సిమెంట్ లోడ్ లారీ ముందు భాగం

అద్దంకి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి సిమెంట్ లోడు లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్యాబిన్ నుజ్జునుజ్జుకాగా డ్రైవర్ అందులో చిక్కుకుపోయాడు. బయటకు తీసేందుకు సుమారు 2 గంటల సమయం పట్టింది. పోలీస్‌ల కథనం మేరకు అద్దంకి మండలంలోని చక్రాయపాలెం సమీపంలో భవనాసి చెరువు కట్ట వద్ద నామ్ రోడ్డుపై శుక్రవారం ఉదయం బొగ్గులారీ అద్దంకి వైపు వస్తూ మరమ్మతులకు గురై ఆగిపోయింది. వెనుక నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. దీంతో సిమెంట్ లోడు లారీ క్యాబిన్ పూర్తిగా దెబ్బతింది. సిమెంట్ లోడు లారీ డ్రైవర్ నరేంద్ర క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని నరేంద్రను బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి చివరకు ఎక్స్‌కవేటర్ సహాయంతో క్యాబిన్‌ను తొలగించి తీవ్రంగా గాయపడ్డ లారీ డ్రైవర్ నరేంద్రను బయటకు తీసి 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పాల వాహనం బోల్తా

పంగులూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు, చందలూరు గ్రామాల మధ్య సురభి డెయిరీ పాలవాహనం అదుపు తప్పి రోడు మార్జిన్‌లో బోల్తా పడింది. మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద గల డెయిరీ నుంచి శుక్రవారం ఉదయం పాలవాహనం పాల పదార్థాలతో చందలూరు వైపుగా చీరాల వెళ్లేందుకు బయలుదేరింది. తూర్పుకొప్పెరపాడు గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న కారుకు దారి ఇచ్చే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో పడిపోయింది.ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఎన్.కల్యాణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

మేదరమెట్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పమిడిపాడులో యువకుడిపై కత్తితో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. శుక్రవారం రాత్రి మొద్దు హనుమంతరావు భార్యతో గొడవపడుతుండగా ఆమె సమీప బంధువు అయిన మీసాల గోపి అడ్డు వెళ్లడంతో హనుమంతరావు కత్తితో దాడిచేశాడు. దీంతో గోపి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని ఒంగోలుకు తరలించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

● 11 ద్విచక్ర వాహనాల స్వాధీనం

● ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలో తనిఖీలు

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ అభిషేక్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని తోటవారి పాలెం, ఈపూరుపాలెం, వాడరేవు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానితుల వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	38.2	28.0
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	27
కందుకూరు	36	28



చూడాలని ఉంది కాకాణీ..
ఒక్కసారి వచ్చిపోవా!?

- నీ తిట్లు వినకపోతే నిద్ర కూడా రాదయ్యా!
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎద్దేవా!
- కాకాణి ఆచూకీ చెబితే కరోనా ప్యాలెస్ బహుమతి

వెంకటాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : 'కేసులకు అదరను.. బెదరను అని చెప్పి తొడలు కొట్టిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలి. నిన్ను చూడాలని ఉంది ఒక్కసారి వచ్చిపోవయ్యా కాకాణీ.' అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడుపాళెంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల ఖాకీ దుస్తులు ఊడబెరకతానన్న కాకాణి తప్పు చేశాడు కాబట్టే పిరికిపందలా పారిపోయాడని విమర్శించారు. కాకాణి ఆచూకీ తెలిపిన వారికి పార్టీలతో సంబంధం లేకుండా కరోనా ప్యాలెస్‌ను బహుమతిగా ఇస్తామని ఎద్దేవా చేశారు. 'నీ తిట్లు విని చాలా కాలమైంది. నీ తిట్లు వినకపోతే నాకు నిద్ర రాదయ్యా! నన్ను తిడితే మళ్లీ వినాలని ఉంది.



బయటకు రావయ్యా వచ్చి ఒక్కసారి తిట్టవా!?' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, సర్వేపల్లి ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, చాట్ల వెంకట సుబ్బయ్య, మల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

146 ఎల్సీ గేట్ ఇండికేషన్ ఫెయిల్

- రైళ్ల పరుగుకు అంతరాయం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని శ్రీవేంకటేశ్వర పాలెం రైల్వే స్టేషన్ ఎగువ, దిగువ మార్గాల్లో శుక్రవారం సాయంత్రం మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొదిసేపు ఆగిపోయాయి. రైల్వే అధికా రుల సమాచారం మేరకు.. రైల్వే ఎల్సీగేట్ 146 వద్ద సాంకేతిక లోపంతో ఇండికేషన్ ఫెయిల్ అయింది. గేట్ వేసిన తరువాత కూడా సిగ్నల్ పడకపోవడంతో నెల్లూరు వైపు వెల్లే జనశతాబ్ధి, హోరా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగాయి. వేంకటేశ్వర పాలెం హోమ్ సిగ్నల్ వద్ద దురంతో సూపర్‌ఫాస్ట్ రైలు అగింది. ఈ మూడు రైళ్లు ఒక్కొక్కటి 15 నిమిషాల పాటు ఆగిన అనంతరం సిగ్నల్ పడడంతో యధావిధిగా బయలుదేరి వెళ్లాయి.

నేర నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

నెల్లూరు (క్రైం) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసులు గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు అన్ని కూడళ్ళు, జాతీయ రహదారుల ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరపూరిత కార్యక్రమాలు జరగ కుండా, అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4 వేల వాహనాలు తనిఖీ చేయగా డ్రంక్అండ్ డ్రైవ్ 27 కేసులు, ఎంవీ యాక్ట్ 75 కేసులు నమోదు చేసి రూ.68,420 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అలాగే 15 అనధికార వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. కాగా, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అయ్యప్ప తన సిబ్బందితో గాంధీబొమ్మ సెంటర్‌లో తనిఖీలు చేస్తుండగా కత్తితో తిరుగుతన్న నాయబ్‌ను పట్టుకున్నారు. మరొకరు పరారయ్యారు.



కపాడిపాలెంలో శిలువను మోస్తున్న నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సర్వమానవ శ్రేయస్సు కోసం ఏసుక్రీస్తు రక్తతర్పణం చేసిన రోజుగా శుక్రవారం గుడ్‌ఫ్రైడేను జిల్లాలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్నీ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు బోధనలు వినిపించారు. నెల్లూరులో బిషప్ ఎండీ ప్రకాశం శిలువ మార్గాన్ని కపాడిపాలెం వీధుల్లో నిర్వహించారు. చర్చుల్లో క్రీస్తు మరణానికి ముందు, తర్వాత జరిగిన అద్భుతాలను వివరించారు. కాగా, మానవాళి కోసం రక్తం ధారబోసిన క్రీస్తును స్మరించుకునే రోజే గుడ్‌ఫ్రైడే అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏసు బోధనలు ఆదర్శనీయమని తెలిపారు. కపాడిపాలెంలో క్రైస్తవులతో కలిసి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ శిలువ మోసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- రేపు ఈస్టర్

గుడ్‌ఫ్రైడే నాడు శిలువ వేసిన అనంతరం మూడవ రోజు ఆదివారం క్రీస్తు పునరుత్థానం (తిరిగిలేచి) చెందిన రోజుగా ఈస్టర్ పండుగను క్రైస్తవులు జరుపుకుంటారు. ఈ సంద ర్భంగా చర్చి సేవలకు హాజరవుతారు. ఊరేగింపులు, అన్నదానాలు, జాగరణలు చేస్తారు.

టీచర్ల బదిలీకి
రంగం సిద్ధం

- సీనియారిటీ జాబితాలపై కసరత్తు
- ఈ నెల 24 నుంచి 26వరకు మెడికల్ బోర్డులు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను విద్యాశాఖ రూపొందించి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీటిపై అభ్యంతరాలను కూడా స్వీకరించి మార్పు, చేర్పులు చేపడుతూ తుది జాబితాను పారదర్శకంగా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అన్నీ పూర్తి చేసి ఈ నెలాఖరున హెచ్ఎంల బదిలీలు, మే నెలలో ఎస్ఏ, ఎస్‌జీటీల పదోన్నతులు, బదిలీలు చేపట్టే దిశగా విద్యాశాఖ వేగవంతంగా అడుగులు వేస్తోంది. ఇందులోభాగంగానే ఈ నెల 24 నుంచి 26వతేదీ వరకు మెడికల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ వేగవంతంగా నిర్వహిస్తోంది. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేయడం, టీచర్ల అభ్యంతరాలు స్వీకరించి సరిదిద్దడం వంటి వాటిలో సిబ్బంది బిజీగా ఉన్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం భారీగా బదిలీలు జరగనున్నాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. దీర్ఘకాలంగా పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీగ్రేడ్ టీచర్లతో కలిపి జిల్లాలో వెయ్యిమందికిపైగా బదిలీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. వీటన్నింటికి అనుగుణంగా ప్రభుత్వం కూడా మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. దీనికోసంగా టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25 అమల్లోకి తీసుకువచ్చి ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి పీడితులు తదితర కారణాలపై మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేలా ఈనెల 24 నుంచి 26వతేదీ వరకు ఉమ్మడిజిల్లాలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- బదిలీల్లో పారదర్శకత

ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకత ఉండేలా బదిలీల ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40శాతం వైకల్యం ఉన్నవారికి కూడా ప్రాధాన్యత కేటగిరీలో చేర్చడంతో పెద్దఎత్తున సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ఈ ఏడాది మాత్రం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు. 40శాతం నుంచి 50శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్నవారికే బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. 56 నుంచి 69శాతం వరకు శారీరక వైకల్యం, వినికిడిలోపం, దృష్టిలోపం ఉన్నవారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. 70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా వీరికి బదిలీల్లో స్థానాలు కోరుకునేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. అలాగే 80 శాతం అంతకంటే ఎక్కువ శారీరక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు, 70శాతం అంతకంటే ఎక్కువ శారీరక, దృష్టిలోపం ఉన్నవారు, క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవ మార్పిడి, మేజర్ న్యూరోసర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. అదేవిధంగా స్పౌజ్ లేదా పిల్లలు కాని బుద్ధి మాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు, తలసేమియా, హీమోఫిలియా, మస్క్యూలర్ డిస్ట్రోఫీతో వైద్యం చేయించుకుంటున్న పిల్లలు ఉన్నవారు, గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు.

సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రాధాన్యత కేటగిరిల్లో బదిలీ కోరుకునే టీచర్లు దీనికి సంబంధించిన సర్టిఫికేట్‌లు, గత మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాలని డీఈఓ డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. ఈనెల 24 నుంచి 26వతేదీ వరకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని సర్టిఫికేట్‌లు పొందాలన్నారు. దీనికోసంగా విద్యాశాఖ అధికారులు సంబంధిత వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారన్నారు. మూడురోజుల్లో సర్టిఫికేట్‌ల జారీకి ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- ఆర్.బాలాజీరావు, డీఈవో



హాయ్.. హలో!

- సినీ నటి సమంత సందడి

'హాయ్.. హలో..' అంటూ ప్రముఖ కథానాయకి సమంత సందడి చేశారు. కొడవలూరు మండలం రాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్పోర్ట్స్ డే టెక్ ఫెస్ట్ వేడుకల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'శుభం' సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో అలరించారు.

- కొడవలూరు(ఆంధ్రజ్యోతి)

వీఆర్‌కు ఇద్దరు సీఐలు

- రెండు హత్యలతో డీజీపీ సీరియస్

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కన్నెర్రజేశారు. ఈ నెల 16వ తేదీ రాత్రి నవాబు పేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో రెండు హత్యలు జరగడం, ఓ హత్య దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో డీజీపీ ఆరాతీశారు. ఈ నేపథ్యంలోనే నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిలను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. దీంతో వారు గురువారం రాత్రి రిలీవ్ అయ్యారు. వారి స్థానాల్లో ఎవరినీ నియమించకపోవడంతో నవాబుపేట స్టేషన్ ఇన్‌చార్జ్‌గా బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, వేదాయపాలెం స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యను నియమించారు.

వారి నిర్లక్ష్యం..
వీరికి శాపం!

- రెండేళ్ల తర్వాత దివ్యాంగులకు ట్రైసైకిళ్లు
- 200 మందికి ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం

వారంతా దివ్యాంగులు.. తోటి మనిషి సాయం లేనిదే బయటకు రాలేని విధి వంచితులు.. పట్టుదలతో తమ పనులను తాము చేసుకోవాలన్న ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులు.. అటువంటి వారికి ట్రైసైకిళ్లు, ట్రైస్కూటర్లు చాలా అండగా నిలుస్తుంటాయి. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారుల తీరు మారింది. ఏడు నెలలపాటు వీరు ప్రదర్శించిన నిర్లక్ష్యమో లేదా మరేదైనా కారణమో తెలియదు కానీ దివ్యాంగులకు దక్కాల్సిన నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. మార్చి 31 నాటికి ప్రభుత్వం ఇచ్చిన నిధులను దివ్యాంగుల సంక్షేమ శాఖ వినియోగించుకోకపోవడంతో ఆ కేటాయింపులు రద్దయ్యాయి. దీంతో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించాలన్న ప్రభుత్వ ఉన్నత లక్ష్యం నీరుగారింది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- గతేడాది ఆగస్టులో రూ.14 లక్షల మంజూరు
- కాంట్రాక్టర్లు రాలేదని చేతులెత్తేసిన అధికారులు
- ఒక్క సైకిలూ అందించకుండానే నిధులు వెనక్కి

జిల్లాలో సుమారు 40 వేల మంది వరకూ విభిన్న ప్రతిభావంతులు ఉంటారు. వారిలో శారీరక వికలాంగులు 10 వేల వరకూ ఉంటారని అంచనా. ఏటా అర్హులైన వారికి ట్రైసైకిళ్లు, ట్రైస్కూటర్లు, ఫోన్లు, వినికిడి యంత్రాలు.. ఇలా అనేక రకాల వస్తువులను ప్రభుత్వం అందజేస్తూ ఉంటుంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. చివరకు నెల్లూరులో ట్రైసైకిళ్ల తయారీ యూనిట్‌ను కూడా మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతేడాది ఆగస్టులో జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించాలని నిర్ణయించింది. 200 మందికి ట్రైసైకిళ్లు అందించేందుకు గతేడాది ఆగస్టు 22వ తేదీన రూ.14 లక్షలు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఒక్క దివ్యాంగుడికి కూడా ట్రైసైకిల్ అందించలేదు. ఈ సైకిళ్ల తయారీకి మొదటిసారి టెండర్ పిలవగా ఒకే ఒక కాంట్రాక్టర్ టెండర్ వేశారు. సింగిల్ టెండర్ ఇవ్వకూడదని అధికారులు మరోసారి టెండర్ పిలిచారు. ఈదఫా ఒక్కరు కూడా టెండర్ వేయలేదు. దీంతో మిన్నకుండిపోయారు. వాస్తవానికి టెండర్లు వేసేందుకు కొందరు ముందుకొచ్చినా దివ్యాంగుల సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బెదిరించి వెనక్కు పంపారని దివ్యాంగుల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. మొదటిసారి ఒకరు ముందుకు రాగా రెండోసారి ఆ వ్యక్తి కూడా టెండర్ వేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా చూపిస్తున్నారు.



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం



- నిధులు వెనక్కు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏదైనా వర్కుకు నిధులు తెచ్చు కోవడమే కష్టంగా ఉంది. అటువంటిది దివ్యాంగుల సంక్షేమం కోసం నిధులు ఇచ్చినా ఉపయోగించుకోలేకపోవడం తీవ్ర విమర్శలకు తావి స్తోంది. ఏడు నెలల కాలంలో రెండుసార్లు టెండర్లు పిలిచిన అధికా రులు ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చాలా ముఖ్యమైన విషయం. ఈ ప్రక్రియలో ఎవరూ టెండర్ వేయకపోతే అత్యవసర పనుల కింద నామినేషన్ ఇచ్చి సైకిళ్లు తయారు చేయించే అధికారం జిల్లా అధికారులకు ఉంటుంది. కానీ ఆదిశగా ఎవరూ ఆలోచించలేదు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది కాబట్టి నిధులు వాడుకోకపోతే వెనక్కు వెళ్లిపోతాయన్న విషయం కూడా అధికారులకు తెలుసు. అయినా సీరియస్‌గా తీసుకోక పోవడం గమనార్హం. ఇప్పుడు ట్రైసైకిళ్ల పంపిణీకి ఇచ్చిన నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. దీనిపై కూడా ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలే దంటే దివ్యాంగుల పట్ల అధికారుల వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తయారు చేసే ట్రైసైకిళ్లపై సీఎం చంద్రబాబు ఫోటో వేయాల్సి ఉంటుందని, ఇది ఇష్టం లేకనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా ట్రైసైకిళ్ల తయారీలో నిర్లక్ష్యం చేశారని దివ్యాంగుల సంఘాల నాయకులు ఆరోపిస్తుండటం కొసమెరుపు

జేసీ దృష్టికి తీసుకెళ్లాం

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులిచ్చింది. మొదటి సారి టెండర్ పిలిస్తే ఒక కాంట్రాక్టరే వచ్చారు. రెండోసారి ఎవరూ రాలేదు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆ తర్వాత ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ఏమీ చేయలేకపోయాం. ఇప్పుడు నిధులు వెనక్కు వెళ్లాయి. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లాం.

- అయూబ్ ఖాన్,
విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ

చికెన్ ధరలు	
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	109
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
కోడిగుడ్ల ధర (100)	420

బంగారం, వెండి ధరలు	
బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9201
వెండి కిలో ధర	రూ. 98.300
వెండి ఒక గ్రాము	రూ.101.30

పాఠశాలలో వంటగది నిర్మాణానికి సాయం

కొండాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట గది నిర్మాణానికి టీడీపీ మండల కన్వీనర్ ఓంకార్ చేయూత నిచ్చారు. వంటగది లేక పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి రూ.25 వేలతో నిర్మాణం చేయించి శుక్రవారం పాఠశాలకు అప్పగించారు. అలాగే ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

న్యూస్ బాక్స్

21న ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో కావలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు షేక్ నసీర్ అహ్మద్, ఎంబీఎఫ్ రెహమాన్, షేక్ షారూక్, వామపక్షనాయకుడు లక్ష్మీరెడ్డిలు మాట్లాడారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు వారి ఆస్తులను నిర్వహించుకునే హక్కు కల్పించిందని, కేంద్ర ప్రభుత్వం ఈ హక్కును కాలరాయడానికి ప్రయత్నిస్తోందన్నారు. దేశంలోని ముస్లింలు, ప్రజాస్వామిక వాదులు, అన్ని వర్గాల ప్రజలు ఈ వక్ఫ్‌బోర్డు చట్టసవరణ వ్యతిరేకించాలన్నారు. 21న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు జమీర్, జిలానీ, మహబూబ్ బాషా, ఎస్‌డీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శ్మశానంలో చేతిపంపునకు మరమ్మతులు

కొండాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం గ్రామ శ్మశానంలోని చేతి పంపు దాదాపు నాలుగేళ్ల నుంచి మరమ్మతులకు గురైంది. శ్మశానంలో అంత్యక్రియల సమయంలో నీటి అవసరాలకు నగదు వెచ్చించి ట్యాంకర్లతో తోలించుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన గ్రామ టీడీపీ నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో మాట్లాడి శుక్రవారం బోరుకు మరమ్మతులు చేయించారు.

జామాయిల్ చెట్ల నరికివేత

గుడ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు అటవీ ప్రాంతంలో అక్రమంగా జామాయిల్ చెట్లను నరికివేశారు. ఫారెస్టు అధికారులు అందించిన వివరాల ప్రకారం.. గుడ్లూరు కమ్మపాలెంకు చెందిన ఇద్దరు యువకులు పోట్లూరు సమీపంలో 185 జామాయిల్ చెట్లను గురువారం నరికి వాటి నెంబర్లను చెరిపివేశారు. అదేరోజు రాత్రి లోడు చేసుకునేందుకు కుప్పలుగా చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా సమాచారం రావడంతో డీపీఎం స్వాతి సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈ క్రమంలో ఓ యువకుడు పరారు కాగా మనోజ్ అనే యుకుడిని అదుపులోని తీసుకున్నారు. అక్రమ రవాణాకు కూలీలుగా వచ్చిన మండలంలోని మెగుళ్లూరు గిరిజన కాలనీకి చెందిన ముగ్గురు రోజువారి కూలీలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరుపుతున్నామని డీపీఎం శుక్రవారం తెలిపారు.

కోదండరాముడి ఆలయంలో ధ్వజారోహణ

బిట్రగుంట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని కోదండరామస్వామి ఆలయంలో జరుగనున్న ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఉదయం విఘ్నేశ్వర స్వామి పూజ, అఖండ జ్యోతి ప్రజ్వల చేశారు. గుజరాత్‌లోని ఓ టైల్స్ కంపెనీలో తయారు చేయించిన వీరహనుమాన్ చిత్రాన్ని ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ చేశారు.

రక్తదాన శిబిరం

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పామూరు ఉమ 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్, రాజాలు శ్రీధర్ మల్టీసూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీధర్ దంపతులతో పాటు వారి సిబ్బంది తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డి.రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, కే.హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 45 ఏళ్లుగా కొందరు బడాబాబుల ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు తలొగ్గి ఆక్రమణలను చూస్తూ ఊరుకోవడం వల్లే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. ఓవీ రోడ్డులో మహదేవపురం జంక్షన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు సమగ్ర సర్వే ద్వారా ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని తెలిపారు. ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించి ప్రజలు నడిచేందుకు వీలుగా వాటిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పోస్టాఫీసు సెంటర్‌లో ఉన్న పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం స్థలాన్ని పెయిడ్ పార్కింగ్ ప్లేస్‌గా మారిస్తే ట్రాఫిక్ సమస్య తీరటంతో పాటు ప్రభుత్వానికి రాబడి కూడా వస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ముందడుగు వేస్తే బీజేపీ సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

● షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా శుక్రవారం కావలి జేబీ కళాశాల ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని సరదాగా కొంత సేపు షటిల్ ఆడారు.


షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి అభివృద్ధే లక్ష్యం

కావలి అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 39వ వార్డులో గడపగడపకు ఎమ్మెల్యే కార్యక్రమంలో సమస్యలను తెలుసుకుంటూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ మిగిలినవి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ.శ్రావణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రళయకావేరి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బ్రిడ్జి సెంటర్‌లోని పాత బాప్టిస్ట్ చర్చి, ఆర్టీసీ ఎదురుగా జీడీ కాంపౌండ్‌లోని చర్చి, కచ్చేరి మిట్టలోని ది తెలుగు బాప్టిస్ట్ చర్చి, బుడమగుంట షారోన్ ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. చర్చిలను విద్యుదీపాలంకరణ అలంకరించారు.


కావలి : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

లింగసముద్రం : మండలంలోని శింగరపాలెం, లింగసముద్రం, ఆర్ఆర్ పాలెం, పెంట్రాల, మొగిలిచెర్ల, పెదపవని, చినపవని, వీఆర్ కోట, గంగపాలెం తదితర గ్రామాల్లో చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శింగరపాలెం చర్చిలో పాస్టర్ ఆల్బర్ట్ చంద్రన్‌పాల్ ప్రత్యేక బోధన చేశారు.

అల్లూరు : మండలంలోని అల్లూరు దళితవాడలోని రక్షణ సైన్యం, బాప్టిస్టు చర్చి, శెటిల్మెంటు ప్రాంతంలోని ట్రినిటి గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలతోపాటు మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బిట్రగుంట : బోగోలులోని హోలీఫ్యామిలీ చర్చి ఫాదర్ బి.పాల్ క్రీస్తు సిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వాటర్ ట్యాంకు పరిశీలన

కావలి రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాలెం, బుడంగుంటలలో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులపై క్షణ క్షణం.. భయం భయం అంటూ ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం చౌదరిపాలెంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకును మున్సిపల్ ఏఈ షేక్ ఫాజిల్ పరిశీలించారు. ట్యాంకు స్థితిగతుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని ఉండటం తో ట్యాంకు కూలితే ప్రక్కనే ఉన్న నివాసాలపై పడుతుందని, ట్యాంకును తొలగించాలని స్థానిక టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు ఏఈకి తెలిపారు. పినాకిని కన్సల్‌టెన్సీ వారు వచ్చి ట్యాంకు పరిశీలించి ఇచ్చే డెమాలిష్ రిపోర్టు ఆధారంగా 10 రోజుల్లో ట్యాంకును కూల్చివేత పనులు చేపడుతామని ఏఈ తెలిపారు.


వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఏఈ షేక్ ఫాజిల్

రివర్షన్ పొందిన వారికి న్యాయం చేయాలి

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గతంలో హైస్కూల్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది రివర్షన్‌లో ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల్లో న్యాయం చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎస్జీటీలుగా రివర్షన్ పొందిన ఉపాధ్యాయుల సమావేశం వారు మాట్లాడుతూ ప్రస్తుతం విడుదల చేసిన ఎస్జీటీ సీనియారిటీ జాబితాలో గత సీనియారిటీని వదిలేసి తాము రివర్షన్ పొందిన తేదీ నుంచి పరిగణిస్తూ అందరికన్నా జూనియర్లుగా చూయించారన్నారు. తాము ఉద్యోగాల్లో చేరిన తేది ఆధారంగా సీనియారిటీ జాబితా రూపొందించాలని కోరారు. సమావేశంలో ముప్పూరి మాల్యాద్రి, జల్లి తిరుమలరావు, రాచపూడి శంకర్, షేక్ అబ్దుల్లా, ఎం.కొండయ్య, కల్లగుంట మోహనరావు, పోకూరి మాలకొండయ్య పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

ఉలవపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని వాక గ్రామంలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవగా జరిగింది. కందుకూరు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందచేశారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ఉలవపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులోని కోటిరెడ్డి కుంట ఎస్టీ కాలనీలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు తనకుమార్తె శ్రీతేజస్విని పుట్టిన రోజు సందర్భంగా బ్యాగ్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయని వరలక్ష్మి, న్యాయవాది వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు ఉన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : కావలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మి కేన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో ఆమె చికిత్సకు బెస్ట్ వాకర్స్ శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయమందించారు. వైకుంఠపురం వాసి అల్లూరు నాగమణి కోడలు మంజుల మృతి చెందడంతో ఆమె ముగ్గురు పిల్లలు నాయనమ్మ సంరక్షణలో ఉండడంతో వారి పోషణకు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో టీవీ శేషయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణ, భాస్కర్‌నాయుడు, గౌస్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాసవీనగర్‌లో మరో చోరీకి విఫలయత్నం

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీనగర్‌లో దొంగలు భారీ చోరీకి పాల్పడి వారం రోజులు గడవకముందే మరో ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం జరిగింది. ఇన్నమూరి నరసింహారావు కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్తూ తాళం వేసి వెళ్లగా దొంగలు తలుపు తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాను కూడా పగులగొట్టారు. అయితే విలువైన వెండి, బంగారు ఆభరణాలు బీరువాలోని ఇనుప పెట్టెలో ఉండటంతో దొంగలు ఆ ఇనుపపెట్టెను ఓపెన్ చేయలేక వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం తిరిగొచ్చిన నరసింహారావు కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న 2 కిలోల వెండి దొంగలు అపహరించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ ఎస్ఐ రమణయ్య దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి బీరువాలోని ఇనుపపెట్టె ఓపెన్ చేయలేదన్న విషయాన్ని గుర్తించి దాని తాళం తీయించగా విలువైన ఆభరణాలన్నీ ఉన్నాయి. అయితే బీరువా పగులగొట్టి ఉండటంతో ఆ కంగారులో ఇనుపపెట్టె చూసుకోలేదని బాధితుడు పోలీసులకు తెలిపాడు. వారం రోజుల వ్యవధిలోనే వాసవీకాలనీలో రెండు చోరీలు జరగటంతో దొంగలు కూడా కాలనీలోనే ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

వారం రోజుల వ్యవధిలోనే వాసవీకాలనీలో రెండు దొంగతనాలు జరగడంతో శుక్రవారం రాత్రి సీఐ వెంకటేశ్వరరావు కాలనీలో సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాలనీలో సీసీ కెమెరాలు లేనందునే దొంగలను పట్టుకోవటం కష్టంగా మారిందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ తమ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని, తలుపులు తాళాలు వేసి బయటకు వెళ్లేవారు చుట్టుపక్కలవారికి చెప్పటంతో పాటు ఆ ఇంటిపై వాచ్‌మెన్ నిఘావేసి ఉండేలా సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల వలలో పడి నష్టపోకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం

అల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుపేట సత్రంలోని గంగమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. వీజీఎం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 27 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి, స్థానంలో కోవూరు, రెండో స్థానంలో నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం, మూడోవ స్థానంలో కోవూరు, నాలుగో స్థానంలో కోవూరు మండలం పాటూరు, ఐదో స్థానంలో యల్లాయపాలెంకు చెందిన ఎడ్లు విజేతలుగా నిలిశాయి. వీటి యజమానులకు చిలంకూరు చంద్రశేఖర్‌రెడ్డి రూ.25,116, కడివేటి హజరత్‌రెడ్డి రూ.20,116, వేగూరు అన్వేష్ రూ.15,116, అళహరి రామారావు, మంజుల దంపతులు రూ.10,116, గుండాల గోపాలయ్య, మహాలక్ష్మమ్మ దంపతులు రూ.7,116లు నగదు బహుమతులు అందజేశారు.


మొదటి బహుమతి అందుకుంటున్న విజేత ఎడ్ల యజమాని

బోరుకు కొత్త మోటారు ఏర్పాటు

లింగసముద్రం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీ (కొమ్ముపాలెం)లో 4 నెలలుగా మరమ్మతులకు గురైన మంచి నీటి బోరుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో మంచినీటి బోరుకు రాజకీయ గ్రహణం శీర్షికతో వచ్చిన వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్‌లు గ్రామానికి చేరుకుని బోరును పరిశీలించారు. మోటారు పాడైపోవడంతో గ్రామ టీడీపీ నాయకుడు లోమడ ప్రసాద్ సహకారంతో కొత్త మోటారు తెప్పించి బిగించారు. అనంతరం ఆయన స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. దీంతో కాలనీవాసులు అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చిట్టిబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.


బోరు నుంచి వస్తున్న నీరు

రేపు చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

● టీడీపీ శ్రేణులకు మంత్రి ఆనం పిలుపు

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి 75వ జన్మదిన వేడుకలను ఈనెల 20వ తేదీన ఆత్మకూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు, శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. మండల కేంద్రాల్లో, మున్సిపాల్టీలో జన్మదిన వేడుకలను, సేవా కార్యక్రమాలను పూర్తిచేసుకుని అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆత్మకూరుకు తరలిరావాలని, మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో నిర్వహించే పూర్ణాహుతి హోమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హోమం అనంతరం అన్నప్రసాదం ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఆయన హోమం నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు ఇచ్చారు. మండలాల వారీగా జన్మదిన వేడుకల నిర్వహణపై టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీసీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కేశవచౌదరి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ నేతలు తాళ్లూరి గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి : ముస్లిం జేఏసీ

ఉదయగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం ఉదయగిరి పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు, పార్టీలకు అతీతంగా నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి మెయిన్‌బజార్ గుండా పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గం మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం పెద్ద మసీదు ఆవరణలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ముస్లిం సమాజానికి నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు సయ్యద్ సమీ, అబ్దుసుభాన్, దస్తగిరి అహ్మద్, అహ్మద్‌బాషా, రియాజ్, యస్థాన్, తాజుద్దీన్, వైద్యులు సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్, న్యాయవాది శేషారెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, మన్సూర్, రఫీక్‌ఖాన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిలో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లిం జేఏసీ నేతలు

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


సభ్యత్వ కార్డులు అందచేస్తున్న టీడీపీ నేతలు

వింజమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిస్టీపురం పంచాయతీ చింతలపాలెం గ్రామంలో శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ నాయకత్వంలో ఆ గ్రామంలోని బూత్ నెంబరు 173, 174 పరిధిలో పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు డాక్టర్ కృష్ణారెడ్డి, లక్కు వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీను, దిద్దిగుంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని వాటర్ ప్లాంట్‌లు శుభ్రం చేయడం, మోటార్ల మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో మున్సిపాల్టీ పరిధిలోని 4,5,6,7,8,9,10,11,13,15,16,17,18 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆదివారం యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబయి జాతీయ రహదారిపై రాంపు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆటోలో వెంగారెడ్డిపాళెంలో పాల క్యాన్లను తీసుకుని వంగల్లు వెళ్లేందుకు ముంబయి జాతీయ రహదారి మీదుగా వెళ్తూ రాంపు వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయాలైనవారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళికృష్ణ తెలిపారు. త్రీఫేస్ ఉదయం 8గంటల వరకు ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


సీతారామపురంలో శిలువ మోస్తున్న చర్చి ఫాదర్ సునీల్


● సంగం: మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

●సీతారామపురం: స్థానిక ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరిజనవాడలోని ఆర్సీఎం చర్చి ఫాదర్ సునీల్ ఆధ్వర్యంలో స్థానిక మూడురోడ్ల కూడలి నుంచి చర్చి వరకు ఏసుక్రీస్తు శిలువ మోస్తూ కార్యక్రమం సాగించారు.

●ఉదయగిరి: పట్టణంతోపాటు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, అప్పసముద్రం, కృష్ణంపల్లి, కొండాయపాళెం, దాసరిపల్లి, చెరువుపల్లి, బండగానిపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైసవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్, బాణాసంచా తయారీ కేంద్రాల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజి సంభవించి మంటలు చెలరేగినప్పుడు చేపట్టాల్సిన చర్యలను మాక్‌డ్రిల్ చేసి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


ఆత్మకూరు : మంటలు ఆర్పే విధానాన్ని మాక్‌డ్రిల్ చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

●ఉదయగిరి : అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చేసి చూపించడంతోపాటు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

పీకేపాడులో చలివేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబపాడులో శుక్రవారం వల్లూరు శ్రీనివాసులు సహకారంతో స్థానిక నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో శుక్రవారం పంచమి తిథి, మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

మురికి కాలువలపై మూతల ఏర్పాటు

వింజమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న మురికి కాలువపై మూతలు లేకపోవడంతో స్థానికులు బల్లలను అమర్చారు. మురికి కాలువలపై మూతలు లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోని వైశ్యబజార్, కమ్మబజార్, యాదవ బజార్‌లో కాలువలపై మూతలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.